ప్రజాశక్తి

ఆదివారం 26 అక్టోబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ముంచుకొస్తున్న మొంథా ముప్పు



- పైర్లను కభళిస్తుందని రైతుల్లో ఆందోళన
- భారీనుంచి అతి భారీ వర్షాలకు అవకాశం?
- పాఠశాలలకు 3 రోజులు శెలవు
- గుంటూరులో రేపు గ్రీవెన్సు రద్దు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం క్రమంగా బలపడి తుపానుగా ఏర్పడి ఉమ్మడి గుంటూరు జిల్లాను దెబ్బతీయనుంది. ఈ తుపానకు మొంథా అని నామ కరణంచేశారు. మొంథా తుపాను ముప్పుతో జిల్లాలో రైతులకు అపార నష్టం జరిగే అవకాశం ఉంది. తుపాను ప్రభావంతో ఈదురుగాలలు, అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. తుపాను తాకిడి ఉమ్మడి గుంటూరు జిల్లాపై ఎక్కువగా ఉండవచ్చునని వాతావరణ శాఖ ఇచ్చిన హెచ్చరికలతో గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తం అయ్యారు. సోమవారం నుంచి బుధవారం వరకు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో మూడు రోజుల పాటు పాఠశాలలకు శెలవు ప్రకటించారు. అలాగే సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించే గ్రీవెన్సును రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాన్ దృష్ట్యా ప్రజలు ఎక్కువగా ప్రయాణాలు చేయవద్దని కోరారు. అలాగే తల్లిదండ్రులు చిన్నారులను బయటకు వదలరాదని కోరారు. ప్రజలు తుఫాను దృష్ట్యా ఇంటి వద్దనే ఉండాలని పిలుపునిచ్చారు. తుపానుకు పూర్తి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 0863 2234014 ఏర్పాటు చేశామని దీంతోపాటు డివిజన్ మండల స్థాయిలోనూ కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని చెప్పారు. తుపానుకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు తెలియజేయవచ్చని, అలాగే సమాచారాన్ని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే తుపాను హెచ్చరికలతో రైతుల గుండెల్లో రైళ్లుపరిగెడుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే అధిక వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వరి, పత్తి, కంది, శనగ, మిర్చి సాగు దారులకు వర్షం గండం పైర్లను దెబ్బ తీస్తుందన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు పత్తి పైర్లకు , దిగుబడులకు భారీ నష్టం ఉంటుందని రైతులు చెబుతున్నారు. కాయలు పగిలి పత్తి తీయడానికి సిద్ధంగా ఉన్న ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే పత్తి నేలవారుతుందనే భయం వెంటాడుతుంది. అలాగే కొన్ని ప్రాంతాల్లో పూత రాలిపోయే ప్రమాదం లేకపోలేదు. పల్నాడు జిల్లాలో 2.26 లక్షల ఎకరాలు, గుంటూరు జిల్లాలో 60 వేల ఎకరాలలో ఈ ఏడాది పత్తి సాగు చేశారు. ఎర్ర తెగులు, గులాబి పురుగు పత్తి పైరును వెంటాడుతోంది. గత కొంత కాలంగా తెగుళ్లతో రైతులు అల్లాడుతున్నారు. పత్తి కొనుగోలు ప్రారంభం కాక తీసిన పత్తిని తమ నివాసాల్లో దాచుకోలేక రైతులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది పత్తి క్వింటాలు కనీస మద్దతు రూ.8110గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో కొంత మంది అయిన కాడికి అమ్ముకుంటున్నారు. ఈనేపథ్యంలో పంటను కాపాడుకోవడం, తీసిన పత్తిని విక్రయించు కోవడానికి రైతులు కష్టపడక తప్పడం లేదు. మిర్చి పైరు కొన్ని ప్రాంతాల్లో ఎదుగుదల దశలో ఉండటం వల్ల భారీ వర్షాలకు నీరు నిలబడితే ఉరకెత్తి నష్టం వాటిల్లే అవకాశం ఉంది. కంది, మొక్కజొన్న పంటలకు కూడా నష్టం వాటిల్లవచ్చునంటున్నారు.



గుంటూరులో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టర్లు తమీమ్ అన్సారియా, కలెక్టర్ కృతికా శుక్లా

గుంటూరు, నరసరావుపేట కలెక్టరేట్‌లలో కంట్రోల్ రూం ఏర్పాటు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు



పల్నాడు జిల్లాలో పత్తిపంటను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా

మొంథా తుపాను నేపథ్యంలో అన్ని శాఖల అధి కారులు అప్రమత్త ంగా ఉండి, సూక్ష్మస్థాయిలో అవ సరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టర్‌లు తమీమ్ అన్సారియా, కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శని వారం గుంటూరు, పల్నాడు జిలా నరసరావుపేటలో అధికారులతో కలెక్టర్‌లు సమావేశాలు నిర్వహించారు. గుంటూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులతో కలిసి తుపాను ముందుస్తు సహాయక సన్నాహాక చర్యలపై జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుపాను ఈనెల 28వ తేదీ సాయంత్రం గానీ, రాత్రికి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తుందని తెలిపారు. దాని ప్రభావంతో గంటకు 90 నుండి 100 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీయవచ్చన్నారు. 26వ తేదీనుండి తుఫాను ప్రభావం కనిపిస్తుందని, అదే సమయంలో జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మొంథా తుపాను ప్రభావం గత తుపాన్ల కంటే ఎక్కువుగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరి స్తున్న నేపథ్యంలో అధికారులు రానున్న నాలుగు రోజులు సహాయక సన్నద్ధత చర్యలపై పూర్తి స్థాయిలో నిమగ్నమై ఉండాలని స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతా లను ముందుగానే గుర్తించి అక్కడి ప్రజలను సురక్షితమైన పునరవాస కేంద్రాలకు తరలించేం దుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈదురు గాలులకు కూలెందుకు అవకాశం ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలను ముందు గానే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు

2లో





పూర్తి అయిన భవనం

, నిర్మాణం లో ఉన్న ఆల్ ఇండియా సర్వీస్ అధికారుల భవనాలు

వేగం పుంజుకుంటున్న నిర్మాణాలు

ఆల్ ఇండియా అధికారుల క్వార్టర్లకు తుది మెరుగులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతిలో పలు నిర్మాణాలు వేగం పుంజుకుంటున్నాయి. ప్రధానంగా ఆల్ ఇండియా సర్వీస్ అధికారుల కోసం అమరా వతిలో 115 బంగ్లాల నిర్మాణ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. ఎన్12 రోడ్డుకు సమీపంలో ఈ భవన నిర్మాణాలను కెఎంవి కంపెనీ తుది మెరుగులు దిద్దుతోంది. దాదాపు రూ.430 కోట్లతో గ్రౌండ్ ఫ్లోర్, ఒక అంతస్తుతో కలిపి 115 బంగ్లాను నిర్మిస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు, డైరక్టర్లతో కలిపి మొత్తం 115 బంగ్లాలు ఉండనున్నాయి. వీటిల్లో 25 చీఫ్ సెక్రటరీ కేడర్‌లో ఉన్న వారికి,. మిగిలిన వారు ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు ఉంటారు. లైట్ వెయిట్ సిమెంట్స్ బ్రిక్సుతో నిర్మాణాలు చేపట్టారు. వీటిల్లో ఒక భవనాన్ని ఇప్పటికే పూర్తి చేసి మోడల్‌గా చూపుతున్నారు. వీటిని పరిశీలించిన తరువాత కొన్ని

2లో

గ్రంథాలయ సంస్థ సెస్ బకాయిలు

రూ.64.36 కోట్లు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా గ్రంథాలయ సంస్థ సెస్ బకాయిలను క్రమం తప్పకుండా జమ చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. శని వారం కలెక్టరేట్‌లో సెస్ బకాయిలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో గ్రంథాలయ సంస్థ సెస్ బకాయిలు రూ.64,36,14,822లు ఉన్నాయన్నారు. బకాయిలను ప్రతి నెలా రూ.20 లక్షలు, రూ.10 లక్షలు, రూ.5 లక్షల చొప్పున క్రమం తప్పకుండా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రెండు వారాల తర్వాత తదుపరి చెల్లింపులపై సమీక్ష చేస్తామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఏ నెలలో వసూలు అయిన సెస్ మరుసటి నెలలో చెల్లించాలని జేసీ స్పష్టం చేశారు.

వేగం పుంజుకుంటున్న నిర్మాణాలు

(మొదటి పేజీ తరువాయి)

మార్పులకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. వీటితో పాటు ఎమ్మెల్యేల క్వార్టర్లు, ఉద్యోగుల క్వార్టర్లను సిద్ధం చేస్తున్నారు. గత నాలుగునెలల కాలంలో ఈ పనులకు వర్షాలు తీవ్ర ఆటంకంగా మారాయి. అయితే వచ్చే నెల నుంచి జూన్‌లోగా ఈ నిర్మాణాలను పూర్తి చేయాలని సిఆర్‌డిఏ అధికారులు కాంట్రాక్టు సంస్థలపై వత్తిడి తెస్తున్నారు. మరో వైపు రాయపాడి వద్ద ఐదు ఐకానిక్ టవర్ల నిర్మాణంకూడా తిరిగి వేగం పుంజుకుంటోంది. ఏడేళ్ల క్రితం శంకుస్థాపన చేసినా పునాదులన్నీ నీటిలోనే ఉండిపోయాయి. పునాదుల నాణ్యతపై చెన్నై నుంచి ఐఐటి నిపుణుల బృందం గత ఏడాది అమరావతికి వచ్చి పరిశీలించి పునాదులు ధృఢంగానే ఉన్నాయని, నిర్మాణాలు కొనసాగించవచ్చునని తెలిపింది. ప్రధానంగా ఐదు ఐకానిక్ టవర్లలో 40 అంతస్తుల పరిధిలో నాలుగు, 50 అంతస్తుల టవర్ ఒకటి నిర్మాణం చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. మూడు టవర్లను ఎల్‌అండ్‌టి,రెండుటవర్లను షాపోర్‌జి,పల్లోంజి సంస్థ నిర్మిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అమరావతి ఐకానిక్ భవనాలు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. అత్యంత ఆధునిక టెక్నాలజీతో నిర్మిస్తున్నారు. 2019కి ముందు చేపట్టిన ఈ టవర్లు ఐదేళ్లపాటు పునరాదులకే పరిమితం అయ్యాయి. టిడిపి ప్రభుత్వ ప్రభుత్వ హయాంలో సింగపూర్ కు చెందిన పోస్టర్స్ అండ్ పార్ట్నర్స్ డిజైన్ చేయబడిన ఈ ఐకానిక్ టవర్స్ 2019 నుంచి 2024 వరకు నిర్మాణాలు నిలిచిపోయాయి. వివిధ శాఖల రాష్ట్ర స్థాయి కార్యాలయాలకోసం ఈ టవర్లను నిర్మిస్తున్నారు. దాదాపు రూ.4 వేల కోట్లతో ఈ నిర్మాణాలు చేపట్టారు. దాదాపు ఐదేళ్ల పాటు పునాదులు నీటిలోనే ఉండిపోయాయి. అయినా వీటి నాణ్యత తగ్గలేదంటున్నారు. అయితే తాజాగా ఇక మీదట వరద వచ్చిన దెబ్బతినకుండా చర్యలుతీసుకుంటున్నారు.

30న మెగా జాబ్ మేళ

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను ఈనెల 30వ తేదీన స్థానిక పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కాలేజిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. శనివారం జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ జాబ్‌మేళా ఉంటుందన్నారు. దాదాపు 30కిపైగా కంపెనీలు పాల్గొని 935 ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. జిల్లాలోని యువతి యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి కొండా సంజీవరావు మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గం శాసన సభ్యులు మహ్మద్ నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెగా జాబ్ మేళాలో 10వ తరగతి నుంచి బి.టెక్, ఫార్మసీ, పీజీ విద్యార్హత కలిగినవారు అర్హులన్నారు. ఎఫ్టానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రైమరియా హెల్త్ కేర్, నివారా హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ వంటి పలు రకాల కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. రూ.10 వేల నుండి రూ.30 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. 18-25 ఏళ్ల వయస్సు కలిగిన వారు బయోడేటా లేదా రెస్యూమ్, విద్యార్హత సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్ పోర్ట్ ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూ కు హాజరు కావచ్చని వివరించారు.అదనపు వివరాల కోసం డి.నరేష్ (98663 66187), రామకష్ణారెడ్డి (77319 82861), ఎన్.కపానందం (9581794605)లను సంప్రదించాలన్నారు. కార్యక్రములో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు యు.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

17న ఎపిఎన్‌జిఒ సిటీ తాలూకా యూనిట్ ఎన్నికలు

ప్రజాశక్తి - గుంటూరు

ఏపీఎన్జీజీవోస్ అసోసియేషన్ గుంటూరు సిటీ తాలూకా యూనిట్ ఎన్నికలకు నాయకులు శనివారం ఎలక్షన్ నోటిఫికేషన్ జారీచేశారు. ఎలక్షన్ ఆఫీసర్‌గా డి.డి.నాయక్‌ను అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా బి. అశోక్ కుమార్‌ను, పరిశీలకులుగా ఎస్.రాజశేఖర్‌ను జిల్లా కార్యవర్గం నియామకం చేశారు. ఈ షెడ్యూల్ ప్రకారం గుంటూరు అర్బన్, రూరల్, పెదకాకాని మండలం కలిపి గుంటూరు సిటీ తాలూకా యూనిట్‌కు నవంబర్ 7న సాయంత్రం 5 గంటల వరకూ ఓటర్ల నమోదు కార్యక్రమం, 10న మధ్యాహ్నం 2 గంటలకు నామినేషన్, 17న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు ఎన్నికలు ఏపీఎన్జీజీవోహోమ్‌లో నిర్వహించటం జరుగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ కాపీని గుంటూరు సిటీ తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌పిఎస్ సూరి, సిహెచ్ కళ్యాణ్‌కుమార్‌కు, స్థానిక ఏపీఎన్జీజీవోహోమ్ నోటీస్ బోర్డులో ఉంచినట్లు తెలిపారు.

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని, కూలిపోయిన చెట్లను తొలగించేందుకు అవసరమైన సామాగ్రిని, యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. పునరావాస కేంద్రాల్లో నిత్యావసర వస్తువులను తగిన ప్రదేశాలలో పౌర సరఫరాల శాఖ తగినంత మేర అందుబాటులో ఉంచాలన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లో సరుకులను అందుబాటులో ఉంచాలన్నారు. వసతి గృహాల్లోను విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సంక్షేమ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పత్తి, వరి, మిర్చి ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటలకు తుపాను నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. సహాయక చర్యలకు అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు అవసరమైన సామాగ్రి సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అన్ని ప్రాంతాల్లో సహాయక చర్యలకు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులను, వాలంటీర్లను, స్థానిక నాయకుల వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మండలస్థాయి ప్రత్యేకాధికారులుగా నియమితులైన జిల్లా అధికారులు రానున్న నాలుగు రోజులు మండల కేంద్రాల్లోనే ఉండి క్షేత్ర స్థాయిలో సహాయక ముందస్తు సన్నద్ధత ఏర్పాట్లును పర్యవేక్షించాలన్నారు. జిల్లా స్థాయిలో అవసరమైన సహాయం అందించటానికి అన్ని శాఖల అధికారుతో అవసరమైన సహాయం అందించటానికి కంట్రోల్ రూం ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. సమా వేశంలో డిఆర్‌ఒ ఎన్ ఎస్ కే ఖాజావలి, జెడ్పీ సిఇఒ వి.జ్యోతిబసు వివిధ శాఖల జిల్లా అధి కారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : విపత్తు సమయంలో బాధ్యతగా ఉండాలని తుపాను, భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్థి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కతిక శుక్లా అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో పరిస్థితులపై జిల్లా స్థాయి, క్షేత్ర స్థాయి అధికారులతో శనివారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. 4 రోజులు విస్తతంగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున ముందస్తు చేపట్టాల్సిన చర్యలు దష్ట్యా అన్ని శాఖలు సమన్వయంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 27 నుండి 29 వరకు భారీ వర్షాలు కురుస్తాయని 29 తెల్లవారు జామున తుపాన్ తీరం దాటనున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించిందన్నారు. జలవనరులు, రెవెన్యూ, పోలీసు, రవాణా, మత్స్యశాఖ, పంచాయతీ రాజ్, రహదారులు భవనాలు, వ్యవసాయ తదితర శాఖల అధికారులు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ (ఫోన్ 8647-252999) ఏర్పాటు చేశామని మండల, డివిజన్, స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి జనరేటర్లు, తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని గ్రామాల్లో దండోరా వేసి ప్రజలకు అప్రమత్తం చేయాలని సూచించారు. ఆర్ అండ్ బి, ఈపిడిసిఎల్, వైద్య ఆరోగ్య, మత్స్య సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముంపునకు గురైన ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను తుపాన్ రిలీఫ్ కేంద్రాలకు తరలించాలన్నారు. గర్భిణులు బాలింతలు చిన్నారులు, వద్ధులను, వైద్య సహాయం కావాల్సిన వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రహదారులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలిగితే పునరుద్ధరణ పనులు తక్షణమే చేపట్టాలన్నారు. కచ్చా ఇళ్ళు, అంగన్వాడీలు, పాఠశాల భవనాలపై ప్రత్యేక దష్టి సారించి సత్వరచర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన పంటలకు నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులను అప్రమత్తం చేయాలని వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులను విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను, జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, పీహెచ్ సిలలో సకాలంలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, మందులు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో టెండర్ పొందిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ జరిగేలా ఇంజినీరింగ్ అధికారులు సమర్థవంతంగా పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ హెడ్ వాటర్ వర్క్స్ లో అభివద్ధి పనులు, నందివెలుగు రోడ్, నగరంపాలెం మెయిన్ రోడ్లో పారిశుధ్య పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల వారీగా మంజూరు చేసిన



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

అభివృద్ధి పనుల్లో జాప్యం జరగడానికి వీలు లేదని, ప్రతి పనిని ఎమినిటి కార్యదర్శులు, ఏఈలు ప్రత్యేక శ్రద్ధతో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. పనుల్లో లోపం జరిగితే సంబందిత కార్యదర్శి, ఏఈనే భాధ్యత వహించాలని స్పష్టం చేశారు. హెడ్ వాటర్ వర్క్స్ ఎదుట నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే గేటు ఎదురు ప్రైవేట్ బస్‌లను పెట్టకుండా చూడాలని ఆదేశించారు. నగరంపాలెం రోడ్‌లో డివైడర్ వెంబడి మట్టి లేకుండా స్వీపింగ్ మెషిన్ ద్వారా శుభ్రం చేయాలని, వర్షాల సమయంలో డ్రైన్లపై తొలగించిన మ్యాన్ హోల్ మూతలను తిరిగి ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వర రావు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

భూ యజమానితో సంబంధం లేకుండా

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి - మేడికొండూరు

భూ యజమాని సంతకం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని గుంటూరు జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు పాశం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మేడికొండూరులో కౌలురైతు సంఘం మండల మహాసభను నాయకులు మిన్నగంటి జలంధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాశం రామారావు మాట్లాడుతూ వ్యవసాయ సాగుభూమిలో 70 శాతం వ్యవసాయ భూమి కౌలు రైతులు సాగు చేస్తున్నారని అన్నారు. ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు ఇచ్చి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటల మీద రుణాలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికార ప్రభుత్వ ఎన్నికల హామీలను భాగంగా గుర్తింపు కార్డులు కౌలు రైతులకు ఇచ్చి పంటలు ఇస్తామని వాగ్దానాలు చేపట్టి అధికారం చేపట్టాక ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. సాగు చేస్తున్న పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పించాలని అన్నారు. అదేవిధంగా గిట్టుబాటు ధరలను చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాలలో రైల్వే భూ సేకరణ బాధితులకు 2013 భూ సేకరణ చట్టానికి లోబడి నిబంధనలు అమలు చేయాలని అన్నారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ నవంబర్ మూడో తారీకు గుంటూరులో జరగనున్న ధర్నాను ప్రతి కౌలు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

కౌలు రైతు సంఘం నాయకులు బొట్ల రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి మండలంలో సిసిఐ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని అన్నారు. దేవాదాయ శాఖకు సంబంధించిన భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు కూడా గుర్తింపు కార్డు ఇచ్చి రుణాలు ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా మండల కౌలు రైతు సంఘం కమిటీని, అధ్యక్షులుగా మిన్న గంటి జలంధర్, కార్యదర్శిగా నల్లపాట సురేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు చెరుకూరి చిన్న శౌరి, షేక్ ఇమామ్ షరీఫ్, సభ్యులు దుప్పలపూడి గోపి, మందపాటి సీతారామయ్య, పల్లపు వెంకటేశ్వర్లు, సింగంశెట్టి సుబ్బారావు, దొండపాటి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి పై ఎక్స్‌లో పోస్టులపై కేసు నమోదు

ప్రజాశక్తి తెనాలి : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పై ట్విట్టర్ (ఎక్స్)లో వివాదాస్పద పోస్టులపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూ టౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం ఉపేంద్ర ధర్మ అనే హ్యాండిల్ ద్వారా పోస్టు పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి సీఐ రాముల నాయక్ కేసు నమోదు చేశారు.

వర్సిటీ దూరవిద్య పీజీ కోర్సుల ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూరవిద్యా కేంద్రం జూలై/ఆగస్ట్ నెలల్లో నిర్వహించిన ఎంకాం, ఎంహెచ్‌ఆర్యాం కోర్సుల 1,2,3,4, జర్నలిజం 1, 2, 4, యంఎల్‌ఎస్సి 1, 2 సెమిస్టర్ల రెగ్యులర్ అండ్ సప్లమెంటరీ పరీక్షల ఫలితాలను దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు శనివారం విడుదల చేశారు. ఫలితాలు దూరవిద్య వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని పేర్కొన్నారు. రీవాల్యుయేషనుకు దరఖాస్తు చేసుకునే వారు నవంబరు 7వ తేదీలోగా ఒక్కో పేపరుకు రూ.960 చెల్లించి, 10వ తేదీలోగా దరఖాస్తులు కోఆర్డినేటరుకు అందేలా పంపాలని సూచించారు. ఈ సందర్భంలో దూరవిద్యా డిప్యూటీ రిజిస్ట్రార్ నయూద్ జైనులాబ్దిన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు పి.కఅష్ణవేణి, డి. కోదండపాణి, సూపరింటెండెంట్ టి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గన్నారు.

ఎంబిఏ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

వర్సిటీ పరిధిలో ఎంబిఏ కోర్సు 4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సిఇ ఆలపాటి శివప్రసాదరావు శనివారం విడుదల చేశారు. అలాగే ఎంయస్సీ ఫారెస్ట్రీ 3వ సెమిస్టర్, మాథమాటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, 1,3వ సెమిస్టర్, ఎంఎస్సీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ 1వ సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలను ఆయన విడుదల చేశారు.

నకిలీ విలేకరులపై సీరియస్

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : నకిలీ విలేకరులపై కఠిన చర్యలు తప్పవని తెనాలి మూడవ పట్టణ సిఐ ఎస్ సాంబశివరావు అన్నారు. శనివారం మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పోలీసులు నిర్వహించిన సోదాల్లో విలేకరులమంటూ వీడియోలు తీస్తున్న కొందరు నకిలీ విలేకరులని గుర్తించినట్లు సిఐ పేర్కొన్నారు. యూనిఫామ్ లో ఉన్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన కొందరు విలేకరులను గుర్తించి వారించామన్నారు. ప్రతి విలేకరి తమ సంస్థ జారీ చేసిన గుర్తింపు కార్డు, లేదా ఐ అండ్ పీఆర్ జారీ చేసిన అక్రిడేషన్ కార్డులు తప్పనిసరిగా తమవద్ద ఉంచుకోవలన్నారు. క్రైమ్ సంఘటనలపై నిర్వహించే ప్రెస్ మీట్ ల ద్వారా పాత్రికేయులకు పోలీసుల మధ్య మెరుగైన సత్సంబంధాలు ఏర్పడతాయన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్ : తుపాన్ కారణంగా తహసిల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు సత్తెనపల్లి తహశీల్దార్ కె ఎస్ చక్రవర్తి శనివారం తెలిపారు. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వర్షాలకువాగులు, వంకలు, పొంగిపొర్లి ప్రవహించే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. 96817 71624 నెంబర్ కు కాల్ చేయాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండల కేంద్రమైన ఫిరంగిపురంలోని ఇమ్మి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో శనివారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సైబర్ నేరాల క్రైమ్ బ్రాంచ్ సిఐ షేక్ నజీర్ బాషా మాట్లాడుతూ నేటి సమాజంలో సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతులు ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా ఆన్లైన్ ఉపయోగించి వ్యక్తిగత డేటాను సేకరించి నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఫిరంగిపురం సిఐ కె.శివరామకృష్ణ ఎస్సై పి. సురేష్ పోలీస్ సిబ్బంది, గుంటూరు క్రైమ్ బ్రాంచ్ పోలీసులు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడి మృతి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

గుండెపోటుతో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గోలి బాలజోజి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మండలంలో పలువురు నాయకులు మాట్లాడుతూ బాలజ్యోతి(67) తెలుగుదేశం పార్టీ ప్రారంభం నుంచి నేటి వరకు పార్టీలో కీలక పాత్ర పోషించి మండల ప్రజలకు ఎన్నో సేవలు అందించారని ప్రశంసించారు. బాలజోజి మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. బాలజోజికి భార్యబెనార్డమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. టిడిపి నాయకుడు గోలిబాల జోజి మృతదేహాన్ని రాత్రి 9 గంటలకు ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, మండల టిడిపి నాయకులు సందర్శించి పగాఢ సానుభూతి తెలిపారు.

యువకులపై కుక్కల దాడి

ప్రజాశక్తి - నాదెండ్ల

నాదెండ్ల మండలం కనపర్రులో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు, పెంపుడు జంతువులు, లేగ దూడలు, కోళ్లపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇదే పంచాయతీ శివారు మల్లాయపాలెం గ్రామానికి చెందిన దార్ల రవితేజ, దార్ల జోజప్పను శనివారం కుక్కలు కరిచి గాయపరిచాయి. వీరిద్దరిని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కుక్కలను పట్టించి అడవిలోకి తీసుకెళ్లి వదిలేయాలని గ్రామస్తులు పంచాయతీ అధికారి లక్ష్మీనారాయణకు విన్నవించారు.

విద్యార్థులకు ఉపకారవేతనాలు

ప్రజాశక్తి -

'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ - గుంటూరు' 'ది రాజోలు తాలూకా తెలగ ఉద్యోగుల సంక్షేమ సంఘం - రాజోలు' వారి సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 280 మంది పేద విద్యార్థులకు రూ.11 లక్షల 45 వేలను ఉపకార వేతనాలుగా పంపిణీ చేయనున్నారు. ఇందులో రూ.5 లక్షల 30వేలను తులసి సీడ్స్ వారు కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ద్వారా పేద విద్యార్థులకు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం ఆదివారం శివకోడులోని మంగెన గంగయ్య తెలగ కళ్యాణ మండపంలో ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుంది. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా తులసి గ్రూప్ ఛైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరై వితరణ చేయనున్నారని తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర తెలియజేశారు.

లారీ కింద పడిన జీవాలు మృతి

ప్రజాశక్తి -రెంటచింతల

జాతీయ రహదారిపై మిట్టగుడిపాడు వెళ్లే క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం జీవాలు లారీ కింద పడి మృతి చెందాయి. మిర్యాలగూడ నుంచి పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీకి లోడ్ నిమిత్తం వెళ్తున్న లారీ జీవాలపై తొక్కించడంతో 10 అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 12 తీవ్రంగా గాయపడ్డాయి. సుమారు రూ.1.50 లక్షల దాకా నష్టం సంభవించిందని బాధితుడు బోయిన రాజు తెలిపారు. కేసు నమోదు చేశారు. దామరచర్లకు చెందిన లారీ డ్రైవర్ శాకమూరి శ్రీను పోలీసు ఎదుట లొంగిపోయి నట్లు సమాచారం.

ఇంటి వద్దకే రేషన్

ప్రజాశక్తి - చేబ్రోలు

60ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రేషన్ అందించాలని తహశీల్దార్ కె శ్రీనివాస శర్మ అన్నారు. శనివారం రేషన్ డీలర్ల సమీక్ష సమావేశాన్ని ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించారు. లిస్టులో లేని కార్డులు ఉన్న వృద్ధులు వికలాంగులకు ఎలాంటి ఆటంకం లేకుండా రేషన్ అందించాలని డీలర్లకు ఆదేశించామన్నారు. రేషన్ స్మార్ట్‌కార్డులు ఇప్పటి వరకు సచివాలయ సిబ్బంది నుంచి తీసుకుని లబ్ధిదారులకు ఫోన్ చేసి అందిస్తారని చెప్పారు.

అరవిందలో ఖేలో ఇండియా రగ్బీ పోటీలు



క్రీడాకారులకు మొమెంటో అందజేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి అరవింద సిబియస్ఇ హైస్కూల్లో అస్మిత ఖేలో ఇండియా ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా రగ్బీ అసోసియేషన్ వారు అండర్ -18 బాలికల విభాగంలో పోటీలను శనివారం నిర్వహించారు. పదహారు టీమ్స్ పాల్గొన్న ఈ పోటీలలో ప్రతి టీం మధ్య రసవత్తరమైన పోటీ జరిగింది. అమరావతి రాజధాని సీనియర్స్ టీం ముందుగా ఫైనల్‌లోకి దూసుకువెళ్లగా, సెమీ ఫైనల్లో హోరాహోరిగా తలపడిన నూతక్కి రైజర్స్, అరవింద సిబియస్ఈ టీం మధ్య జరిగిన పోటీలో నూతక్కి టీం ఫైనల్‌లోకి వెళ్ళింది. అరవింద సిబియస్ఈ స్కూల్ మూడవ స్థానాన్ని పదిలపరుచుకుంది. ఫైనల్లో అమరావతి రాజధాని సీనియర్స్, నూతక్కి రైజర్స్ ఫైనల్ మ్యాచ్‌లో అమరావతి రాజధాని సీనియర్స్ విజయకేతనం ఎగురవేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టి.ఆనంద్‌బాబు యస్‌పి కమాండెంట్ హోంగార్డ్, బి.రామాంజనేయులు ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ,కె. సుధాకరావు డియస్‌పి ఇతరులు హాజరయ్యారు. ముఖ్య అతిథులు మాట్లాడారు. అనంతరం విజేతలకు ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్స్ ప్రదానం చేసారు. అరవింద స్కూల్ ప్రిన్సిపాల్ ఇంద్రాణి, అరవింద్ చాగంటి విజేతలను అభినందించారు. అనంతరం క్రీడాకారులను సత్కరించారు.


బత్తిని నాగేశ్వర రావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

అస్వస్థతకు గురైన బత్తిని నాగేశ్వరరావు

పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బత్తిని గార్డెన్స్ అధినేత బత్తిని నాగేశ్వరరావు శనివారం అస్వస్థతకు గురయ్యారు. ఆ సమయంలో ఆయన కుమారుని తోనరసరావుపేట డిఎస్‌పి కార్యాలయంలో ఉన్నారు. హుటాహుటిన హాస్పిటల్‌కు తరలించామని నాగేశ్వరరావు కుమారుడు వెంకటేష్ తెలిపారు. నాగేశ్వరరావు కుమారుడు వెంకటేష్ పోలీసుల తీరును తప్పుబట్టారు. కేసు ఏమిటో, తమపై ఎవరు ఫిర్యాదు చేశారో చెప్పకుండా డిఎస్‌పి తన కార్యాలయానికి పిలిపించి వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాగేశ్వరరావుకు ఏమైనా జరిగితే పోలీసులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టణ ప్రముఖులు నాగేశ్వరరావును, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రస్తుతం నాగేశ్వరరావు పరిస్థితి నిలకడగా ఉంది.

ఎస్‌సి, ఎస్‌టి కేసుపై విచారించేందుకు పిలిపించాం డిఎస్‌పి హనుమంతరావు

బత్తిన నాగేశ్వరరావు ఏ-1, కుమారుడు వెంకటేష్ ఏ-2 గా 1వ పట్టణ పోలీస్ స్టేషన్లో నమోదైన ఎస్‌సి, ఎస్‌టి కేసు విచారణకు హాజరు కావాలని నోటీసులు పంపగా వారు తీసుకోలేదని దీనిపై విచారించేందుకు డిఎస్‌పి కార్యాలయానికి పిలిపించామని డిఎస్‌పి తెలిపారు. కేసు పూర్వాపరాలపై బత్తిని నాగేశ్వరరావును అడుగగా ముందు నోటీసులు తీసుకోవాలని సూచించామన్నారు. తమ న్యాయవాది సూచన మేరకు నోటీసులు తీసుకుంటామని బయటకు వెళ్లి తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని డిఎస్‌పి హనుమంతరావు వివరించారు. తమ కార్యాలయంలో ఎటువంటి అస్వస్థతకు గురి కాలేదన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - పెదనందిపాడు

మంథా తుఫాను సందర్భంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎస్ హేనాప్రియ తెలిపారు. అత్యవసర పనుల నిమిత్తం తప్ప బయటకు రావద్దని, ఇళ్లల్లోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. శనివారం సాయంత్రం పెదనందిపాడు నల్లమడ వాగు కట్టమీద నివసిస్తున్న కుటుంబాల వారి వద్దకు వెళ్లి తుఫాను సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. నల్లమడ వాగు ప్రవాహమును పరిశీలించారు. అత్యవసర సమయంలో దిగువ తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. తహశీల్దార్: 9949098619 ఉప తహశీల్దార్: 9640405207, రెవిన్యూ ఇన్స్పెక్టర్: 8121395 395.ఉప తహశీల్దార్ షేక్ కరిముల్లా, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అమరవీరుల దినోత్సవంపై వ్యాసరచన

తెనాలి : స్థానిక మారీసుపేట నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలను త్రీ టౌన్ సిఐ ఎస్ సాంబశివ రావు, సిబ్బంది పర్యవేక్షించారు. సిఐమాట్లాడుతూ పోలీసు అమరవీరుల దినోత్సవం ప్రాధాన్యత, విధి నిర్వహణలో పోలీసులకు ఎదురయ్యే సవాళ్లను విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశంతో వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


సంఘటనలో దెబ్బతిన్న బస్సు ముందు భాగం

లారీని ఢీ కొన్న తెలంగాణా ఆర్టీసీ బస్సు

ఎనిమిది మందికి గాయాలు

ప్రజాశక్తి-దాచేపల్లి

అతి వేగంగా వస్తున్న లారీని తెలంగాణా ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో బస్సులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలైన సంఘటన మండలంలోని శ్రీనగర్ సాగర్ ఫ్యాక్టరీ వద్ద శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడా నుంచి దాచేపల్లికి తెలంగాణా ఆర్టీసీ డిపోబస్సు బయలుదేరింది. బస్సుకు ముందు అతివేగంగా వెళ్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకు వేయడంతో బస్సు లారీని వెనుక నుండి ఢీ కొట్టింది. ఆ సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న 45 మందిలో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వారిని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు, మిగిలిన నలుగురిని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


షేక్ సుభానిని పరామర్శిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

షేక్ సుభానికి పరామర్శ

మంగళగిరి : ఇటీవల అకస్మాత్తుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మంగళగిరి -తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ మైనార్టీ సెల్ కోఆర్డినేటర్ షేక్ సుభానిని శనివారం మంగళగిరి పట్టణంలోని నివాసంలో కలిసి ఏపీఎం ఎస్ఐడిసి ఛైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

మహారాజశ్రీ ఒంగోలు 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

EP No : 110/2019

in

OS No : 370/2014

Between

జాగర్లమూడి రామకృష్ణారావు

S/o కాశీ విశ్వనాథం గుంటూరు ..... D.H.R

వర్సెస్

గరిగంటి రాజేష్ S/o వెంకటేశ్వర్లు గుంటూరు ...J.D.R

To

గరిగంటి రాజేష్ S/o వెంకటేశ్వర్లు,

బూర్లే వారి వీధి,

ప్రస్తుతం : శ్యామల నగర్, గుంటూరు.

పై నెంబర్ EPలో మీకు ఎన్నిసార్లు నోటిసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టువారు మీ నోటీసు నిమిత్తం పేపర్ ప్రకటనకు ఆర్డర్ వేసినారు వాయిదా తేదీ 04-11-2025న ఉదయం గం 10.30 నిమిషాలకు మీరు గానీ మీ తరపున అడ్వకేట్ ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెయను లేనియెడల మీపరోక్షమున తీర్మానించబడునని తెలియ జేయడమైనది

ఇట్లు
షేక్ ముస్తాక్
DHR తరపు న్యాయవాది
ఒంగోలు

దావా సమన్సు/నోటీసు

మహారాజశ్రీ గుంటూరు 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

ఓ.యస్.నెం.1016/2024 మరియు ఐ.ఎ.నెం.1147/2024

బిట్వీన్:

పర్చూరి రమేష్ ..... వాది(పిటీషనరు)

మరియు

కుర్రా శివగోపి ....ప్రతివాది (రెస్పాండెంటు)

టు,

కుర్రా శివ గోపి, తండ్రి. సాంబశివ రావు, నివాసం డోర్ నెం.4-54, ఉప్పలపాడు గ్రామం, పెదకాకాని మండలం, గుంటూరు జిల్లా

పై నెంబరు దావా ఓ.యస్.నెం.1016/2024లో ప్రతివాది మరియు ఐ.ఎ.నెం. 1147/2024 ఇన్ ఓ.యస్. నెం.1016/2024 పిటీషనులో రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు/ నోటీసులు ఎన్ని సార్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు /నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియ జేయమని శ్రీ కోర్టు వారు ది:26-11-2025నకు వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును . లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

వాయిదా తేది:26-11-2025

కె.ఎ.విల్సన్,
వాది(పిటీషనరు) తరపు అడ్వకేట్,
2/3 బ్రాడీపేట, గుంటూరు.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు

ఓ.యస్ నెం. 31/2023

బిట్వీన్ :

బ్యాంక్ ఆఫ్ బరోడ, రిప్రజెంటెడ్ బై ది మేనేజర్, వినుకొండ బ్రాంచి ....వాది

ఎదిరి

రసపుత్ర జగన్నాద శింగ్ అలియాస్ జగ్గయ్య మరిఒకరు ..... ప్రతివాదులు

టు :

1వ ప్రతివాది :- రసపుత్ర జగన్నాద సింగ్ అలియాస్ జగ్గయ్య తండ్రి బాలాసింగ్ అలియాస్ బాలయ్య డోర్.నెం.1-279, మెయిన్ రోడ్డు, చెట్టుపల్లి గ్రామం, వినుకొండ మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు దావాలోని వాది అయిన బ్యాంక్ ఆఫ్ బరోడ, వినుకొండ బ్రాంచి నుండి మీరు లోన్ తీసుకొని మీరు బాకి చెల్లించనందున మీపై వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు దావా దాఖలు చేసి మీకు దావా సమను జారి అగుటకు ఎన్ని సార్లు బత్తాలు కట్టినను మీరు దావాసమను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా. పై కోర్టునందు వాయిదా ది. 04-11-2025న అయి వున్నది. ఆరోజు మీరు స్వయంగా గాని, మీ లాయరు ద్వారా గాని ఉ॥ 10-30 ని లకు పై కోర్టు నందు హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపగలరు అట్లు మీరు వాయిదాకు హాజరు కానిచో మీ పరోక్షముగా తీర్మానించబడునని ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా:- 04-11-2025

ఇట్లు
చాగంటి వీరాంజనేయ చౌదరి
వాది తరపు న్యాయవాది, వినుకొండ.
సెల్ నెం.9848021892



కలుపు తీస్తున్న వ్యవసాయ కూలీలు

పనులు లేక వ్యవసాయ కూలీల ఇక్కట్లు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నియోజకవర్గంలో ఎక్కువ మంది కూలీలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. వరస అల్పపపీడనాల ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రైతులతో పాటు రైతు కూలీలు అవస్తులు పడుతున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో సుమారు 15వేలనుండి 20వేల వరకు వ్యవసాయ కార్మికులు వ్యవసాయ మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సత్తెనపల్లి మండలంలోనే 6వేలమంది వ్యవసాయ కూలీలు ఉన్నారు. వర్షాల వల్ల వ్యవసాయ పనులకు ఆటంకం కలగడంతో వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారు. అధిక వర్షాలకు కలుపు తీత,పనులు పత్తి తీత పనులు నిలిచిపోవడంతో కూలీల కు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారు. అర్దిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కౌలు రైతులకు రాయితీలు అందడంలేదు

ప్రజాశక్తి-ముప్పాళ్ల



సభలో మాట్లాడుతున్న నాయకుల

ప్రభుత్వం ఇచ్చే రాయితీలు కౌలు రైతులకు అందటం లేదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం గ్రామసభ మండలంలోని చాగంటి వారిపాలెం గ్రామం లో శనివారం జరిగింది. సభకు తోరటి అమరలింగేశ్వరరావు అధ్యక్షత వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ సాగుచేసే వ్యవసాయ భూమిలో 70శాతం దాకా కౌలు రైతులే ఉన్నారనీ వ్యవసాయానికి ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి రాయితీలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వాలు వ్యవసాయానికి ఇచ్చే సబ్సిడీలు రద్దు చేస్తూ మొత్తం వ్యవసాయాన్ని దివాలా తీసే చర్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని వీటికి వ్యతిరేకంగా రైతులందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ సందర్భంగా ఐదుగురి సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమిటీ కన్వీనర్‌గా మారూరి జగన్మోహన్‌రెడ్డి, కో కన్వీనర్‌గా పోపూరి చిన్న సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి ఈ. అమరలింగేశ్వరరావు తదితరులను ఎన్నికయ్యారు.




పెచ్చులూడి కప్పు నుండి కారుతున్న నీళ్లు

సమస్యల వలయంలో..
సంక్షేమ హాస్టళ్లు

మాచర్ల పట్టణంలోని సంక్షేమ హాస్టళ్లు సమస్యలతో సతమతమవుతున్నాయి. అక్షరాస్యతలో జిల్లాలో చివరి స్థానం మాచర్లదే. అభివృద్ధి, తలసరి ఆదాయంలో కూడా వెనకడుగే. ఇక్కడ వలస కూలీలు అధికం కావటంలో తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా చేయాలని తపనతో హాస్టళ్లతో వుంచి చదివించుకుంటూ ఇతర ప్రాంతాలకు పనుల నిమిత్తం వెళ్తూంటారు. నియోజవర్గంలో మారుమూల గిరిజన తండాలకు రవాణా సౌకర్యం సరిగా లేదు. పేదలు అధికంగా వుండే తండా వాసులు తమ పిల్లలను పట్టణంలోని హాస్టళ్లలో వుంచి చదివించుకుంటున్నారు. ఇలా పట్టణానికి వచ్చి చదువుకునే వారికి సంక్షేమ హాస్టళ్లు తగినంత సౌకర్యంగా లేకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యల మధ్యే తమ చదువులను కొనసాగిస్తున్నారు.

- ప్రజాశక్తి, మాచర్ల

- ఎస్సీ,బీసీ స్కూల్ విద్యార్థులకు వసతి గృహాలు లేవు
- పెచ్చులూడి కప్పు నుండి కారుతున్న నీళ్లు
- ఇన్‌చార్జి వార్డెన్లతో హాస్టళ్ల నిర్వహణ



అద్దె భవనంలో నడుస్తున్న బిసీ కాలేజి బాయ్స్ హాస్టల్



అధ్వానంగా ఉన్నగది

దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల బాలుర విద్యార్థులకు కొరకు మాచర్ల పట్టణ శివారులో 30 ఏళ్ళ కిందట మూడు హాస్టళ్లను ప్రభుత్వం నిర్మించింది. వీటిలో ఎస్సీ, బీసి హాస్టళ్ల భవనాలు పూర్తిగా శిథిలమవటంతో ఎస్సీ హాస్టల్ ను తాత్కాలిక భవనంలో, బీసీ హాస్టల్ ప్రయివేటు భవనం నిర్వహిస్తున్నారు. ఇవి రెండూ కూడాను కాలేజి విద్యార్థులకు మాత్రమే. ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ బాలుర వసతి గృహం స్లాబ్ పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు కనపడుతున్నాయి. వరండా, గదుల్లో స్లాబ్ పెచ్చులూడి వర్షపు నీరు కారుతున్నాయి. గతంలో మరమ్మతులకు గురైౖ ప్రయివేటు భవనంలోకి మారిన ఎస్సీ బాలిక హాస్టల్‌కు మరమ్మతులు పూర్తి కావటంతో ఇక్కడకు తాత్కాలికంగా ఎస్సీ బాయ్స్ కాలేజి హాస్టల్‌ను మార్చారు. వచ్చే విద్యాసంవత్సరం నుండి బాలికల వసతి గృహం ఇక్కడే నిర్వహించనున్నారు. ఎస్సీ బాలుర విద్యార్థులు వేరే అద్దె వసతి గృహాన్ని చూసుకోవాల్సి వస్తుంది. ఎస్సీ బాలికల హాస్టల్ నెహ్రూనగర్ ఫైర్ స్టేషన్ వద్ద ప్రైవేటు భవనంలో నడుస్తుంది. హాస్టళ్ల విద్యార్థులు చదువుకొనే స్కూళ్లకు, కాలేజీలకు దూరంగా వుండటంతో విద్యార్థులకు భారంగా వుంటుంది. వర్షాకాలం ముగిసి చలికాలం ప్రారంభమవుతుంది. విద్యార్థులకు కొందరికి మాత్రమే దుప్పట్లు అందాయి. రెండు మూడు రోజుల్లో విద్యార్థులందరికీ దుప్పట్లు అందిస్తున్నట్లు ఆయా హాస్లళ్ల వార్డెన్లు చెప్పారు.

ఎస్సీ, బీసీ స్కూల్ విద్యార్థులకు వసతి గృహాలు లేవు..

ఎస్సీ, బీసీ స్కూల్ విద్యార్థులకు వసతి గృహాలు లేకపోవటంతో ఆయా తరగతులకు చెందిన వారు ఇబ్బందుదుల పడుతున్నారు. గతంలో వున్న ఎస్‌సి, బిసి హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య తక్కువగా వుండటంతో మూత పడ్డాయి. దానికి కారణం హాస్టళు పాఠశాలకు దూరంగా వుండటమే. ఈ విధంగా మూతపడటం వలన పట్టణంలోని హాస్టళ్లలో వుంచి చదివించు కోవాలనుకునే వారికి నిరాశే ఎదురవుతుంది. పట్టణంలో హైస్కూల్ స్థాయి వరకు ప్రైవేటు, ప్రభుత్వం ఆధ్వర్యాన మంచి పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వం విద్యార్థులకు అందించే సంక్షేమ పథకాలు వలన హాస్టళ్లలో వుంటూ ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే వెసులబాటు వుంది. తల్లికి వందనం, హాస్టల్ విద్యార్థులకు వచ్చే సంక్షేమ పథకాలు వలన పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. వసతి గృహాలు అనుకూలంగా వుంటే విద్యార్థులు సంఖ్య పెరిగే అవకాశం వుంది.

ఇన్‌చార్జి వార్డెన్లతో హాస్టళ్ల నిర్వహణ..

పట్టణంలోని హాస్టళ్లు ఇంఛార్జి వార్డెన్ల నిర్వహణలో నడుస్తున్నాయి. బిసి హాస్టల్ వార్డెన్ ఒకరే మాచర్లతో పాటు దుర్గి, కారంపూడి హాస్టళ్ల నిర్వహణ బాధ్యతులు కూడా చూస్తున్నారు. వందమందికి పైగా విద్యార్థినులుండే ఎస్సీ బాలకల హాస్టల్ వార్డెను సత్తెనపల్లి, మాచర్ల హాస్టళ్ల బాధ్యతను చూస్తున్నారు. ఎస్సీ బాయ్స్ వార్డెన్ రెండు హాస్టళ్లు ఇలా వార్డెన్లు రెండు మూడు హాస్టళ్లు నిర్వహణ బాధ్యతులు చూస్తుండటంతో నిర్వహణ లోపాలు వస్తున్నాయి. ఎస్టీ హాస్టల్ వార్డెన్ పర్మినెంటుగా వున్నారు. హాస్టల్ వార్డెన్ల సంఖ్య పెంచాలి. ప్రతి హాస్టల్‌కు పర్మినెంట్ వార్డెన్ వుండేలా చూడాలి.అప్పుడే హాస్టల్ నిర్వహణ చక్కగా జరిగి, విద్యార్థులు క్రమశిక్షణగా వుంటారు. కాలేజి స్థాయి హాస్టళ్లలో వార్డెన్ల కొరత వలన విద్యార్థులు చెడు అలవాట్లకు లోనై గ్రూపులుగా విడిపోయి ఘర్షణలు పడుతున్నారు. ఈ మధ్యనే ఒక హాస్టల్లో విద్యార్థుల మధ్య కోట్లాట జరిగింది.

హాస్టల్ మరమ్మతులకు రూ. 17 లక్షలు కేటాయింపు

బాలుర గిరిజన సంక్షేమశాఖ వసతి గృహం మరమ్మతులకు జిల్లా కలెక్టర్ రూ. 17 లక్షలు నిధులు మంజూరు చేశారు. త్వరలో మరమ్మత్తు పనులు మొదలవుతాయి. విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందిస్తున్నాం. హాస్టల్ నిర్వహణలో ఎటువంటి లోపాలు తావివ్వకుండా చూస్తున్నా. సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాము.

- రామ్మోహన్‌రావు, గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్ వార్డెన్

సంక్షేమ హాస్టళ్లు నిర్మించాలి



పట్టణంలో ప్రభుత్వ భవనాల్లో నడిచే సంక్షేమ హాస్టళ్లు రెండు మాత్రమే ఉన్నాయి. స్థానికంగా అందుబాటులో వున్న ప్రభుత్వ స్థలాల్లో విద్యార్థులకు అవసరమైన సంక్షేమ హాస్టళ్లు నిర్మిస్తే ఉపయోగకరంగా వుండేది. కానీ రాజకీయ నేతలు తమ ఓట్ల రాజకీయాలు కోసం విలువైన, అనువుగా వుండే భూములను ఇతర అవసరాలకు వినియోగించటంతో పేద విద్యార్థులకు అన్యాయం జరిగింది. ఇప్పటికైన నేతలు విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించి, వారికి మెరుగైన సంక్షేమ వసతి గృహాలు నిర్మించాలి. అలానే గురుకుల పాఠశాలలు కూడా ఏర్పాటు చేయాలి. కనీసం పాఠశాలవిద్య వరకైన బడిఈడు పిల్లలందరూ చదువుకునేలా కఠినంగా చర్యలు చేపట్టాలి.

- బండ్ల మహేష్, మాచర్ల సిపిఎం నాయకులు



మహాసభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ధరలు పెరిగినప్పుడు జీతాలు ఎందుకు పెంచరు?

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - పిడుగురాళ్ళ

రాష్ట్రంలో నిత్యావసర ధరలు పెరిగినప్పుడు కార్మికుల జీతాలు ఎందుకు పెరగడంలేదని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరావు అన్నారు. శనివారం స్థానిక పిలుట్ల రోడ్డులోని టిఎస్ రెడ్డి డిగ్రీ కళాశాలలోని కాంద్రకుంట సీతారామయ్య ప్రాంగణంలో సిఐటియు పల్నాడు జిల్లా 2వ మహాసభలు ఘనంగా జరిగాయి. తొలుగ సిఐటియు జెండాను నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. అనంతరం సిపియం జాతీయనేత సీతారాం ఏచూరి, రైతుసంఘం, సిఐటియు మండల నాయకులు బంగా నాగేశ్వరావు, కాంద్రకుంట సీతారామయ్య చిత్ర పటాలకు సిపియం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ పూలమాలలు వేసి నివాళర్పించారు. మహాసభకు సిఐటియు నాయకులు గుంటూరు మల్లిశ్వరీ, షేక్ శిలార్, హరిపోతురాజు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముఖ్య అధితులుగా హాజరైన సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు ఉమామహేశ్వరావు, ముజఫర్ అహ్మద్ ప్రసంగించారు. దేశంలోని అన్ని రాష్ట్రల్లో సిఐటియు మహా సభలు నిర్వహిస్తున్నారని, త్వరలో విశాఖ వేదికగా నిర్వహించబోయే సిఐటియు జాతీయ మహాసభను విజయవంతం చేయాలని పిలుపిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడి, సామ్రాజ్యవాద విధానలు వల్లన అన్ని వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రపంచంలో సోషలిస్టు దేశాలు చైనా, క్యూబా, వియాత్నం, లావోస్, ఉత్తర కొరియా దేశాలు కరోనా సమయంలో వైద్యసేవలు అందించారని పేర్కొన్నారు. అలాంటి దేశాలపై పెట్టుబడి, సామ్రాజ్యవాద దేశాలు నాశనం చేసేందుకు చూస్తున్నాయని అన్నారు. దేశంలో నూటికి 90శాతం కార్మిక వర్గం వల్ల వస్తున్న సంపదను కేవలం ఇద్దరు మాత్రమే దోచుకుంటున్నారని, అంబాని జియో పెట్రోల్ బంకులు పేరుతో బయట దేశాలలో 35రూపాయిలతో లీటర్ పెట్రోల్ కొని 110రూపాయిలకు మనకి అమ్ముతున్నారని అందులో కేంద్రంకు 18 రూపాయిలు రాష్టనికి 25రూపాయిలు వెళ్తుంటే 20 రూపాయిలు అంబానికి చేరుతున్నాయని అన్నారు. దేశంలో నిరుద్యోగం,ఆకలి చావులు పెరిగిపోయాయని అన్నారు. రాష్ట్రంలో రైతులకు కనీసం పెట్టుబడులు కూడ రావడంలేదని, అంగన్‌వాడీలుకు జీతాలు పెంచడంలేదని, ఉద్యోగ భద్రత లేదని అన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాడాల్సిన అసెంబ్లీలో వారి స్వప్రయోజనాల కోసం పోరాటాలు చేస్తున్నారని అన్నారు.మన హక్కుల కోసం మనం అసెంబ్లీలో పోరాడలని అన్నారు.డిల్లీలో నల్ల చట్టాలపై రైతులతో కలిసి అన్ని రంగాల వారు పోరాడి సాధించుకున్న విజయాలను గుర్తు చేసుకొని ఐక్యంగా పోరాడాలని అన్నారు. అనంతరం సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయేలు నాయక్ నివేదిక ప్రవేశ పెట్టారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాధకృష్ణ సౌహార్ధ సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.వెంకటేశ్వర్లు, బండ్ల మహేష్, తెలగపల్లి శ్రీనివాసరావు, డి.శివకుమారి, బందగి సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.





సభలకు హారైన సిఐటియు నాయకులు, జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి : సిపిఎం


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి రూరల్ మండలంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లోని విలీన గ్రామాల లోని ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని లేనిచో దశల వారీ ఆందోళన చేపడతామని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. శనివారం మండలం చిన్న కాకాని గ్రామంలోని సిపిఎం కార్యాలయంలో మండల నాయకులు జి. బాబు వరప్రసాద్ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గన్న ఈమని అప్పారావు మాట్లాడుతూ మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌లోని విలీన గ్రామ ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇళ్ల స్థలాల సమస్యపై మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి ఇళ్లు లేని పేదలందరూ తమవ్యక్తిగత అర్జీలను మున్సిపల్ కమిషనర్‌కి అందజేశారు. కార్పొరేషన్‌లోని విలీన గ్రామ ప్రజలు తహశీల్దార్ కార్యాలయంలో తమ వ్యక్తిగత అర్జీలు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ తెలపడంతో వారు తహశీల్దార్‌ని కలిశారు. తహశీల్దార్ తహశీల్దార్ తనకు ఎలాంటి అధికారాలు లేవని, కమిషనర్‌కు మాత్రమే ఇవ్వాలని తెలిపారు. ఈ విషయమై కమిషనర్ దగ్గరికి వచ్చి అర్జీలకి తగిన రసీదులు ఇవ్వాలని కోరినా అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారని, కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామ ప్రజలను మోసం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. విలీన గ్రామాల్లోని ప్రజలకు ఏదైనా సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని తెలిపారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో విలీన గ్రామ ప్రజల వద్ద ఇంటి పనులు వసూలు చేస్తున్నప్పుడు అలాగే గ్రామాలన్నీ కూడా మున్సిపల్ కార్పొరేషన్ లో కలిసిపోయాయని మున్సిపల్ అధికారులు మొత్తం నిర్వహణ చేస్తున్నప్పుడు సమస్యలను ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకోవటం మాని ఇళ్ల స్థలాల సమస్యపై ఇచ్చిన వ్యక్తిగత అర్జీలకు రసీదులు ఇవ్వాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాలలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వల్ల మురుగు తోటి దుర్గంధం వెదగలుగుతున్నాయని తెలిపారు. భారీ వర్షాలు కురిసినప్పుడు నీరు మొత్తం ఇళ్లల్లోకి వస్తున్నాయని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగి విష జ్వరాలు సోకుతున్నాయని తెలిపారు. అలాగే రోడ్లు లేవని, స్మశాన స్థలానికి వెళ్ళడానికి కూడా దారులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలందరూ ఎందుకు మున్సిపల్ కార్పొరేషన్ లో కలిపారా అని ఆవేదన చెందుతున్నారని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మరియు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తాడేపల్లి మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విలీన గ్రామ ప్రజల యొక్క సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిచో మున్సిపల్ కార్యాలయం వద్ద దశల వారీ ఆందోళన చేపడుతామని అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మంగళగిరి మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, నాయకులు బి. కోటేశ్వరి ,ఎస్. సుమ, జి.అజయ్, వి.భారతి కే.శివశంకర రావు, టి.ప్రసాద్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



పెనుమాక ఎల్ఈ పాఠశాలకు వందేళ్లు

ప్రజాశక్తి- తాడేపల్లి

పెనుమాక ఎల్ఈ పాఠశాల నేటికి వందేళ్లు పూర్తిచేసుకుంది. శనివారం ఉపాధ్యాయులు పిల్లలతో కలసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బ్రిటిష్ పాలన కాలంలో నిర్మించిన ఈ పాఠశాల హరిజన, గిరిజనులకు అందుబాటులో విద్యను అందించేందుకు అప్పట్లో నిర్మాణం గావించారు. ఎల్ఈ పాఠశాల నేటికి నిర్విరామంగా కొనసాగుతూ ఆదర్శ పాఠశాలగా కొనసాగ డ0 తమకు గర్వకారణంగా ఉందని ఉపాధ్యాయులు తమ మనోభావాలు వ్యక్తం చేశారు. గతంలో శిథిలావస్తకు చేరడంతో 1980 ప్రాంతంలో పునర్ నిర్మాణం పూర్తి చేసుకొని నేటికీ పేదలవాడలో (దళితవాడ) విద్యా కుసుమాలను వెదజల్లు తుంది. అప్పటిలో 100 నుండి 150 మంది విద్యార్థుల తో మండలం లోని అత్యధిక స్ట్రెంత్ కలిగి నఈ పాఠశాల నేడు కొంతమంది విద్యార్థులు హాజరు తగ్గిన తన ప్రాధాన్యతను నిలబెట్టుతుంది. ఇక్కడ విద్య నభ్యసించిన విద్యార్థులు మంచి స్థాయిలో కొనసాగుతున్నారు. నేటికీ ఇద్దరు ఉపాధ్యాయులు ఇక్కడ విద్యాబోధన చేస్తున్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ పాఠశాలలో పనిచేయటం తమ గర్వంగా ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

30 నుండి ఎయిమ్స్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - మంగళగిరి


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య

తమకు రావలసిన ఎరియర్స్ కోసం ఈనెల 30వ తేదీ నుండి మంగళగిరి ఎయిమ్స్ కార్మికులు ఆందోళన చేస్తున్నట్లు సిఐటియు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య తెలిపారు. మంగళగిరి సిఐటియు కార్యాలయంలో శనివారం రాత్రి మంగళగిరి ఎయిమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం యూనియన్ నాయకులు కె.బుజ్జిబాబు అధ్యక్షతన జరిగింది. చెంగయ్య మాట్లాడుతూ ఎయిమ్స్ కార్మికులు ఎరియర్స్ కోసం లేబర్ కోర్టుకెళ్లి సాధించుకున్నారని తెలిపారు. నాలుగు నెలలు అవుతున్నప్పటికీ ఎయిమ్స్ అధికారులు, కాంట్రాక్టర్లు కార్మికులకు రావాల్సిన లక్షల రూపాయల ఎరియర్స్ ఇవ్వడం లేదన్నారు. అనేక సార్లు వినతి పత్రాలు అందజేసినప్పటికీ స్పందన లేకపోవడంతో ఈనెల 30వ తేదీ నుండి ఆందోళన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లుగా తెలిపారు. అదేవిధంగా ఎయిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులను చిన్నచిన్న తప్పులను చూసి కార్మికులను తొలగించడం అన్యాయమని అన్నారు. వైద్యులు, అధికారులు చేసిన తప్పులను కార్మికులపై మోపుతున్నారని విమర్శించారు. రాజకీయ నాయకులు ఎయిమ్స్‌లో పైరవీలు చేస్తున్నారని అన్నారు. తీసేసిన కార్మికుల స్థానంలో కార్మికులను పెట్టుకునేందుకు లక్షలాది రూపాయలను వసూలు చేస్తున్నారని అన్నారు. హెల్త్ కార్డులు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ సమస్యలపై నిరంతర పోరాటానికి ఎయిమ్స్ కార్మికులు సన్నద్ధమైనట్లుగా తెలిపారు. 2022 సంవత్సరంలో కార్మికులను తొలగించినప్పుడు పోరాటం చేసి విజయం సాధించడం జరిగిందని అన్నారు. ప్రజా ప్రతినిధులుగా గెలిచిన వారు కూడా కార్మికుల హక్కులను కాలరాసేందుకు పూనుకున్నారని విమర్శించారు. అసెంబ్లీలో 13 గంటల పని విధానంపై వచ్చినప్పుడు టిడిపి, వైసిపి పార్టీలు ఒకటయ్యాయని తెలిపారు. వైసిపి పైకి వ్యతిరేకిస్తూ శాసనమండలిలో బిల్లు అయ్యే విధంగా వ్యవహరించాలని విమర్శించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు గాలి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఎ.రవి, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ల చుట్టూ ప్రహరీ నిర్మించాలి :సిఐటియు

- రాత్రిళ్లు మందు బాబులకు ఆవాసాలుగా మారుతున్న అంగన్వాడీ సెంటర్లు
- ప్రహరీ గోడలు లేకపోవడంతో చిన్నారుల భద్రత ప్రశ్నార్థకం



ప్రహరీ గోడలు లేని అంగన్‌వాడీ కేంద్రాలు

ప్రజాశక్తి - పెదకాకాని


అంగన్‌వాడీ సెంటర్ల చుట్టూ ప్రహరీ గోడలు నిర్మాంచాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. ప్రహరీ గోడలు లేక అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందని వాపోయారు. శనివారం సిఐటియు నాయకులు పెదకాకాని, వెనిగండ్ల, నంబూరు, ఉప్పలపాడు, తక్కెళ్ళపాడు, అనమర్లపూడి గ్రామాలలో అంగన్‌వాడీ సెంటర్లని పరిశీలించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ పెదకాకాని మండలంలో చాలా గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ ప్రహరీ గోడలు లేవని వీటివల్ల చిన్నారులు ఆపదలు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొంటాయని, కొన్ని కేంద్రాలలో ప్రహరీ గోడలు లేకపోవడం వల్ల రాత్రులు మందుబాబులు నానా బీభత్సం సృష్టిస్తున్నారని, మద్య సీసాలు తగులగొడుతున్నారని తెలిపారు. కనీసం ఫ్యాన్లు లేక చిన్న పిల్లలు ఇబ్బంది పడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, ఫ్యాన్లు మరుగుదొడ్లు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నపిల్లలకు ఆహారం వండిపెట్టిన బిల్లులు నెలలు తరబడి ఇవ్వడం లేదని, దీంతో వర్కర్స్, హెల్పర్స్ చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుకూలంగా కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగనవాడీ వర్కర్లకి ప్రభుత్వం నుండి వచ్చే అమ్మ ఒడి సంక్షేమపథకాలు రావటం లేదని 7000 శాలరీ తీసుకుంటున్న హెల్పర్లకు ఆన్ లైన్ లో 12000 తీసుకుంటున్నట్టు చూపిస్తున్నారని సరిచేయమని సచివాలయం ఆఫీసులు చుట్టూ తిరిగిన సమస్య పరిష్కారం కావడంలేదని దీనివలన ఎస్సీలకు 200 యూనిట్లు లోపు కరెంటు బిల్లులు చెల్లించన అవసరం లేదని చట్టంలో ఉన్న ప్రతినెలా కరెంటు బిల్లు చెల్లించాల్సి వస్తుందని కొన్ని గ్రామాలలో అంగన్వాడీలను రాజకీయ నాయకులు వేధిస్తున్నారని రాజకీయ నాయకులు అంగన్వాడీలపై వేధింపులు మానుకోవాలని అన్నారు.


దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

ప్రభుత్వం స్పందించాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పరిష్కారం పట్ల ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందని యూనియన్ నాయకులు కొరపాటి స్టీవెన్ అభిప్రాయపడ్డారు. న్యాయంగా తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 326వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. దీక్షల్లో పోతంశెట్టి వెంకటరత్నం, పి.హనుమంతరావు, పిచ్చయ్య, ఆశీర్వాదం, ట్రిఏసోబు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో బి.సూర్యప్రకాష్, షేక్ సుభాని, దామవరపు నాగేశ్వరావు, తుపాకుల నాగేశ్వరావు, వై.సాంబశివరావు, రమాదేవి, వి.రిబ్కా, శరమ్మా, దుర్గాభవాని పాల్గొన్నారు.


జిల్లా కోర్టు కోసం ఎపిఎంఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లికి వినతిపత్రం అందజేస్తున్న న్యావాదులు

జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలో జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలని న్యాయవాదులు కోరారు. ఈమేరకు శనివారం ఎపిఎంఎస్ ఐడిసి చైర్మన్ చిల్లపల్లిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ 2023 జనవరి నెలలో మంగళగిరిలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు మంజూరు చేస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో మునిసిపాలిటీ నిధులు వెచ్చించి కోర్టు ఏర్పాటు కోసం కావలసిన సకల సదుపాయాలు సమకూర్చారు. ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ మాత్రం జారీ చేయలేదు. కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లంకా శివరామ్ ప్రసాద్, కార్యదర్శి కురగంటి రమేష్ పాల్గొన్నారు.


నూతక్కిలో పర్యటిస్తున్న జిఐఎస్‌టి బృందం

ప్రకృతి కేంద్రాలను పరిశీలించిన జిఐఎస్‌టి బృందం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని నూతక్కి గ్రామంలో జిఐఎస్‌టి బృందం శనివారం పర్యటించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు ప్రకృతి కేంద్రాలను పరిశీలించారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, జి.ఐ.ఎస్.టి ఛైర్‌పర్సన్ ఆండ్రే హాఫ్‌మాన్, రొజాలీ హాఫ్‌మాన్, సీఈఓ పవన్ సుఖ్‌దేవ్‌తో పాటు గ్లోబల్ అలయన్స్ ఫర్ ఎసస్టైనబుల్ ప్లానెట్ సెక్రటరీ జనరల్ సత్య ఎస్. త్రిపాఠి ఈ పర్యటనలో పాల్గొన్నారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏడాది పొడవునా నేలను కప్పి ఉంచడం వల్ల నేలలో నీటి నిల్వ శాతం పెరుగుతుందన్నారు. పెదపాలెంలో వరి కాంపాక్ట్ బ్లాకు క్షేత్రాలను బృందం సభ్యులు సందర్శించారు. అందులో నలుగురు ఎస్.సి కౌలు రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నట్లు తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ మరియదాసు

సొంతింటికి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల మండలం జమ్మల మడకలో ఆవాస్ ప్లస్ సర్వేపై శనివారం హౌసింగ్ ఏఈ మరియదాసు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇళ్లు లేని పేద కుటుంబాలకు ఇది మంచి అవకాశ మని, ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు కోరిక మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం కింద సర్వే గడువును పొడిగించిందని తెలిపారు. అర్హులైన వారు తమ వివరాలను నమోదు చేసుకుని సొంత ఇంటి కలను నిజం చేసుకోవచ్చునన్నారు. గృహం లేని వారు వారి ఖాళీ స్థలాన్ని సచివాలయం సిబ్బంది ద్వారా జియో టాగ్ చేయించుకున్న వారికి మాత్రమే పక్కా గృహం మంజూరు చేస్తారని పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారు, గతంలో ఇల్లు లేదా స్థలం పొందనివారు దరఖాస్తు చేసుకోచ్చునని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ స్టాఫ్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మేడం రమేష్ కుమారులు

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని నిరాశ్రయులకు యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ జన్మదినం సందర్భంగా వారి కుమారుల సహకారంతో రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్,శివయ్య స్థూపం సెంటర్‌లతో పాటు పలు కూడలిలో శుక్రవారం రాత్రి నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణి చేసారు. ఫౌండేషన్ వ్యవ స్థాపకులు పమిడిపల్లి అనిల్ రాజ్ మాట్లాడుతూ కొన్ని రోజు లు గా వినుకొండలో విపరీతంగా చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చిన మేడం రమేష్‌కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రమేష్ కుమారుడు మేడం అశోక్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు మనోహర్ బాబు, జాయింట్ సెక్రటరీ కడియం సునీల్, సభ్యులు రత్నం రాజు, దూల్లిపాళ్ళ శ్రీను, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కల్తీ మద్యానికి కేరాఫ్ వైసిపి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి కల్తీ మద్యానికి కేరాఫ్‌గా నిలిచారని టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షులు యం.దారునాయక్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లా డుతూ వైసిపి హయాంలో కల్తీ మద్యం, గంజాయి, నాటు సారా రాష్ట్రంలో ఏరులై పారిందన్నారు. అప్పటి మూలాలను గురిస్తే జగన్‌రెడ్డి దాన్ని టీడీపీ అంటగడతున్నాడని విమర్శిం చారు. కల్తీ మద్యం విషయంలో వైసీపీతో అంటకాగిన టీడీపీ నేతలపై సైతం చర్యలు చేపట్టినట్లు గుర్తు చేశారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రావడం జగన్‌రెడ్డికి కంటిమీద కునుకు లేకుండా చేసిందన్నారు. ముందుగా గూగుల్ వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతుందని విష ప్రచారం చేసి ప్రజల్లో వ్యతిరేకత రావడంతో జగన్ రెడ్డి రూటుమార్చి తన కృషితోనే గూగుల్ వచ్చిందని నిసిగ్గుగా మాట్లాడుతున్నారని అన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతిక శుక్లా

వాటర్ గ్రిడ్ పనులను కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల మండలం రాయవరం గ్రామంలో జరుగు చున్న వాటర్ గ్రిడ్ పథకం పనులను శనివారం కలెక్టర్ కృతిక శుక్లా పరిశీలించారు. జరుగుతున్న పనులను పరిశీ లించి, అధికాలను అడిగి వివరాలు తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేసారు. ప్రాజెక్ట్‌కు అనుమతులు ఏమైనా అవసరం ఉంటే సంబంధిత అధికారులు సూచిస్తారని తెలిపారు. ఈ ప్రాజెక్టు వలన తాగునీటికి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ తెలియజేసారు. కార్యక్రమంలో గ్రామీ ణ నీటిపారుదల శాఖ సిఈ సత్యనారాయణ, గ్రామీణ నీటి పారుదల శాఖ అడ్వయిజర్ తోటప్రభాకర్ పాల్గొన్నారు.

రానున్న తుపానుతో నష్ట పోతామన్న రైతులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు, రానున్న మూడు రోజుల పాటు వర్ష సూచన నేపథ్యంలో పంటలు కాపాడుకునేందుకు రైతులను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ కతికా శుక్లా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నెల 27న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి కుమారుని రిసెప్షన్ వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించేందుకు వెల్దుర్తి వెళ్లిన కలెక్టర్ ఏర్పాట్లు పరిశీలన అనంతరం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పత్తి పంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పరిస్థితులు తెలుసుకున్నారు. వెల్దుర్తి మండలంలో ఇప్పటి వరకు కురిసిన వర్షాల వలన పెద్దగా నష్ట ప్రభావం లేదనీ, రానున్న మూడు రోజుల పాటు కురవనున్న వర్షాలతో నష్టపోయే అవకాశం ఉందని రైతులు కలెక్టర్ వద్ద వాపోయారు. ప్రస్తుతం ఉన్న ధరలతో పెట్టుబడులు పోలిస్తే నష్టం వస్తుందనీ, తుఫాను ప్రభావంతో మరింత నష్టపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి తీత దశలో ఉన్న పంటలను కాపాడుకునే మార్గాలను రైతు లకు వివరించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం. జగ్గా రావును ఆదేశించారు.గ్రామ, జిల్లాస్థాయి వ్యవసాయాధి కారులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రస్తు తం కురుస్తున్న వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు వేయాలని జగ్గారావుకు సూచించారు. ముంపుకు గురైన పంటలు త్వరగా కోలుకోవడానికి నీరు బయటకు పంపి 19-19-19 లేదా, 13-0-45, 10గ్రాముల యూరియా లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు, ఆకుమచ్చ తెగులు నివారణకు 2.5 గ్రాముల కార్బండిజిమ్, మ్యాంకోజెబ్ శిలీంద్రనాశక మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మురళీకృష్ణ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

పారిశుధ్య చర్యలు మెరుగుపరచండి

ప్రజాశక్తి - వినుకొండ

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా గ్రామా ల్లో పారిశుధ్యం పనులు మెరుగు పరచాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జి.బి. ఆంజనేయులు అధికా రులను ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాల యం లో నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీవో లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ కురు స్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాల్లో ప్రజల మౌలిక వసతులు కల్పించేం దుకు, అభి వృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయాలని, ఎవరైనా నిధులు దుర్వినియోగానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేదరిక నిర్మూలనలో భాగంగా పి4 పథ కం ద్వారా అర్హులైన బంగారు కుటుంబాలను గుర్తించి వారిని దత్తత తీసుకుని మార్గదర్శకాలను ఎంపిక చేయాలని అన్నారు. స్థలం ఉండి ఇల్లు కట్టుకునే వారికి పంచా యతీ ల్లో పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించాలని ఎంపీడీవోలకు సూచిం చారు. బొల్లాపల్లి, ఈపూరు, వినుకొండ, శావల్యాపురం, నూజెండ్ల మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

గ్రామీణ లబ్ధిదారుల సొంతింటి కల నెరవేర్చండి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పేదల సొంతింటి కలను నిజం చేయాలన్న బృహత్తర లక్ష్యం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాన్ని జగన్ ప్రభుత్వం నీరు గార్చిం దనీ, ఇళ్ల నిర్మాణానికి కేంద్రమిచ్చిన నిధుల్ని దారి మళ్లిం చిందని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక టిడిపి ప్రధాన క్యాంప్ కార్యాలయంలో శనివారం గృహ నిర్మాణాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏ వై) పథకంలో భాగంగా అర్బన్ పరిధిలో మంజూరైన 207 ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాల న్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికీ ఇళ్లులేని కుటుం బాలు ఎన్ని, ఎన్ని అవసరం, గతంలో ఇల్లు నిర్మించు కొని నివాసముండని కుటుంబాల వివరాలు సేకరించాలని ఆయన అధికారుల్ని ఆదేశించారు. పట్టణాల్లో ఇల్లు కట్టు కునే వారికి రూ.2.50లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.80లక్షలు చెల్లిస్తోందన్నారు. పీఎంఏవైబీ ఎల్‌సీ



శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

2.0లో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన గృహా లబ్ధిదారుల ఎంపికకు కేంద్రం ప్రత్యేకయాప్ ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదా శివరావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వా జి.మదన్‌మోహన్, బండారు పల్లి సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి మాద్దుమాల రవి, హౌసింగ్ డిపార్ట్మెంట్ అధికా రులు డిఇ కె.సాంబయ్య, ఏఈలు కె. విజయ్ కుమార్, బి.నరేంద్ర,షేక్ గౌస్‌బాషా పాల్గొన్నారు.



పోస్టరు ఆవిష్కరిస్తున్న వైసిపి కన్వీనర్ చంద్రయ్య, తదితరులు

28న వైసిపి ప్రజా ఉద్యమ ర్యాలీ

ప్రజాశక్తి - అచ్చంపేట

రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ఈనెల 28వ తేదీన ప్రజా ఉద్యమం కార్య క్రమాన్ని చేపట్టనుందనీ, ఈ ప్రజా ఉద్యమ ర్యాలీకి వేలాదిగా తరలి రావాలంటే అచ్చంపేట మండల వైసిపి కన్వీనర్ చిలకాచంద్రయ్య పిలుపునిచ్చారు. శనివారం ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పిపిపి విధా నంతో ప్రైవేటీ కరణను ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమా నికి మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు హాజరవుతార న్నారు. సమావేశంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు సిహెచ్ సాయిరెడ్డి, ఎన్. చంద్రబాబు, జి.నరసింహారెడ్డి, తిమోతి, కె వీరబాబు, కమల్ సైదా, షేక్‌జానీ, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్. పున్నారావు, ఎం.శ్రీనివాసరావు, బి.నాగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నకరికల్లు

స్థానిక వైసిపి కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమం వాల్ పోస్టర్‌ను వైసిపి మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. రాఘవరెడ్డి మాట్లాడుతూ మెడి కల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రవేటీకరణ చేస్తామ నడం దారుణమని తెలిపారు. ఈనెల 28వ తేదీన సత్తెన పల్లిలో జరిగే కార్యక్రమానికి కార్యకర్తలు భారీగా హాజర వ్వాలని పిలుపు నిచ్చారు. స్టేట్ బూత్ కమిటీ జనరల్ సెక్రె టరీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పాలూరి రాజశేఖర్ రెడ్డి, వైయస్సార్సీపి గ్రామ పార్టీ ప్రెసిడెంట్ పరమేశ్వర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్రోసూరు

కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రైవేటీకరణ పేరుతో రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని క్రోసూరు మండల వైసీపీ అధ్యక్షుడు వెలది అప్పారావు, ఎంపిపి పెరు మాళ్లపల్లి కోటయ్య పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ క్రోసూరులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టి నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో క్రోసూరు టౌన్ ప్రెసిడెంట్ ఖాదర్, అనుముల కోటిరెడ్డి, జెడ్పిటిసి జమీల గఫూర్, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, ముస్తఫా, కాల్వపల్లి శ్రీనివాస రెడ్డి, అన్వర్, దుగ్గికొండలు, గార్లపాటి దాసు, చిలుకాచిన్న, రోషి రెడ్డి, మీరయ్య, చిన్నబాబు, రామకృష్ణ, లక్ష్మయ్య, శ్రీకాంత్, వైఎస్సార్ బాజీ, రఫీ పాల్గొన్నారు.

మాచర్ల నుండి అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి - మాచర్ల

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మాచర్ల డిపో నుండి ప్రతి పౌర్ణమి రోజున అరుణాచలంలోని అరుణాచ లేశ్వ రుని దర్శనము చేసుకొనుటకు గిరిప్రదక్షణకు సూపర్ లగ్జరి బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరా స్వామి శనివారం ఒక ప్రకటలో తెలిపారు. నవంబర్ 3వ తేదీ సాయంత్రం మాచర్ల నుండి బస్సు బయలుదేరి 4వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ 5వ తేదీ అరుణాచలం గిరిప్రదక్షణ 6వతేదీ ఉదయానికి మాచర్లకు చేరుతుందని చెప్పారు. రాను, పోను ఒక్కొక్కరికి రూ. 2750లు అవుతుందని తెలిపారు. మాచర్ల పట్టణ పరి సర గ్రామ ప్రజలు, భక్తులు, తీర్థయాత్రాభిలాషులు ఈ సదవకాశాన్ని వినియోగించు కోవాలని బత్తుల వీరాస్వామి సూచించారు.



కుక్కలను పట్టుకున్న మునిసిపల్ సిబ్బంది

కుక్కల పట్టివేత

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతుం డటంతో మున్సిపాలిటీ వారు జంతు జనన నియంత్రణ కోసం కుక్కలను పట్టుకుంటున్నారు. శనివారం పట్టణం లోని 50 ఆడ, మగ కుక్కలను పట్టుకున్నారు. ఈ సంద ర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజా మాట్లాడుతూ పట్టుకున్న కుక్కలకు సంతానోత్పత్తిని నిరోధించడానికి శస్త్రచికిత్స నిర్వ హిస్తామని, సత్తెనపల్లిలో దీనికి సంబంధించిన పాయింట్ ఉందని చెప్పారు. సత్తెనపల్లిలో ఆడ కుక్కలకు స్పెయింగ్ (గర్భాశయం, అండాశయాలను తొలగించడం), మగ కుక్క లకు ఈ శస్త్రచికిత్సలో వృషణాలను తొలగిస్తారని, ఈ ఆపరేషన్లు అవాంఛిత గర్భాలను నివారించడమే కాకుండా, పయోమెట్రా (గర్భాశయ ఇన్ఫెక్షన్), క్యాన్సర్ వంటి పునరు త్పత్తి సంబంధిత వ్యాధులు రాకుండా చేస్తాయన్నారు. శస్త్రచికిత్స అనంతరం నాలుగు రోజులకు కుక్కలను తిరిగి పట్టణంలో విడిచిపెడతామని చెప్పారు.

లింగ వివక్షపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో శనివారం ఉమెన్ డెవలప్‌మెంట్‌సెల్ అధ్వర్యంలో వర్శిటీలో విద్యార్థులకు లింగ వివక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మార్పు ట్రస్ట్ డైరెక్టర్ రావూరి సూయిజ్ పాల్గొని సమాజంలో మహిళల పాత్ర, పురుషులు, మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. లింగ వివక్షను సమూలంగా నిర్మూలించాలంటే విద్యారంగం నుంచే మార్పు రావాలని అన్నారు. కార్యక్రమంలో విసి డాక్టర్ జి.పార్థ సారథి వర్మ, ప్రోవిసిలు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రావూరి సూయిజ్



పోస్టరు ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- తాడేపల్లి

కూటమి ప్రభుత్వం చేస్తున్న మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి తలపెట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టరును శనివారం తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం సమీపంలోని ఆ పార్టీ కార్యాలయంలో తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్ర ముక్కు వేణుగోపాల్ స్వామి రెడ్డి, తాడేపల్లి మండల అధ్యక్షులు అమర నాగయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పేదవాడికి వైద్యం అందాలంటే మెడికల్ కాలేజీలు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ విభాగ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గోరే బాబు, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్న పోతుల దుర్గారావు, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి మేకవెంకటరామి రెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ సెక్రటరీ ఉయ్యూరు రవీంద్రారెడ్డి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడ వెంకటేశ్వరరావు (పండు), 10వ వార్డు మాజీ కౌన్సిలర్, తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్టిమల్ల స్నేహ సంధ్య, నియోజకవర్గ, తాడేపల్లి పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి- తాడేపల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న ఒక్కరికి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కును మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు శనివారం అందచేశారు. 18వ వార్డుకి చెందిన చాగంటి వెంకటరమణ కుమారి రూ.2,26,712వేల చెక్కును వెంకట్రావు అందచేశారు. వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం ప్రజలకు సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని అన్నారు. టీడీపీ నాయకులు ఇట్టా భాస్కర్, ఏ.మురళి, బి.వెంకటరెడ్డి, కె.విజయ్‌కుమార్, పోతాబత్తిన శ్రీనివాసరావు, పుష్పాంజలి పాల్గొన్నారు.

మండలస్థాయి విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి

నవంబర్ 26వ తేదీ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని సీకే జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో మండల స్థాయిలో విద్యార్థులకు క్విజ్, డిబేట్, వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 11 హైస్కూళ్లకి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. మండల విద్యాశాఖ అధికారి ఎన్.బాబు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సి కె బాయ్స్ హైస్కూల్ హెడ్ మినిస్ట్రెస్ ఏవీఎస్ వరలక్ష్మి, బిఆర్‌నగర్ ఎంటిఎంసి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, వివిధ పాఠశాల చెందిన ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు, బి.నాగార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17ఏళ్లు నిండిన వారు ఓటు నమోదు చేసుకోండి

ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్

ప్రజాశక్తి - తాడేపల్లి

17 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ప్రాస్పెక్టివ్ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ చెప్పారు. తాడేపల్లి అర్బన్‌కు సంబంధించి ఎలక్ట్రోరల్ ప్యూరిఫికేషన్ నిరంతరం ఉంటుందని అన్నారు. శనివారం స్థానిక తాడేపల్లి ఎంటిఎంసీ జోనల్ కార్యాలయంలోని డిప్యూటీ కమిషనర్ చాంబర్లో అఖిలపక్ష పార్టీల నాయకులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ న్యూ పోలింగ్ స్టేషన్ క్రియేషన్ 1200కు పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు 14 ఉన్నాయని, కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు, రెండు పోలింగ్ కేంద్రాలను ప్రక్కనున్న పోలింగ్ స్టేషనులకు సర్దుబాటు చేశామనీ, పొలిటికల్ పార్టీ నాయకుల సమ్మతితో ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కి ఫార్వర్డ్ చేస్తారని తెలిపారు. బిఎల్ఓను సంప్రదించి ఫామ్ 6 పూర్తిచేసి కొత్త ఓటరుగా రిజిస్టర్ కావచ్చు అని అన్నారు. ఓటర్ కార్డులో తప్పులుంటే సరి చేసుకోవచ్చని, పేర్లలో తప్పులు, అడ్రస్ పొరపాటు పడిన సరిజేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, సిపిఎం నాయకులు దొంతి రెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షులు, వల్లభనేని వెంకట్రావు,ప్రధాన కార్యదర్శి దారా దాసు, ఇట్టా భాస్కర్, వైసీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమి రెడ్డి, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు, దినేష్ చక్రవర్తి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దర్శనపు శ్యామూల్, బీజేపీ నాయకులు టంకశాల ఈశ్వర్ నాయుడు, వల్లూరి శివరామకృష్ణ పాల్గొన్నారు.



అఖిల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మోహన్ రావు

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - మేడికొండూరు

విపత్కర పరిస్థితులలో తుపాను సమయంలో పంటలు నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం నుండి నష్టపరి హారం అందించాలంటే ప్రతి రైతు ఈ క్రాప్ట్ నమోదు చేయించుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి ఎన్ మోహన్ రావు రైతులకు పిలుపునిచ్చారు. శనివారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ కూరపాటి నిర్మల అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మోహన్ రావు మాట్లాడుతూ సిసిఆర్సి కార్డులు కౌలు రైతులు తీసుకోవాలని, వారికి కూడా అన్నదాత సుఖీభవ వర్తిస్తుందని అన్నారు. మేడికొండూరు మండల వ్యవసాయాధికారి లక్ష్మి మాట్లాడుతూ రైతులు వేసిన పంటలను ఈ క్రాప్ట్ చేయించుకోవడం వలన ఇన్సూరెన్స్ సీడ్స్ ఎంఎస్‌పి రైతుసేవ కేంద్రం క్రాఫ్‌లోను మీ పంటలకు సబ్సిడీ రుణాలు పొందటానికి అవకాశం ఉంటుందని అన్నారు. న్యాచురల్ ఫార్మింగ్ జిల్లా ట్రైనింగ్ మాస్టర్ ఎం.అన్నమని మాట్లా డుతూ ప్రకతి వ్యవసాయం చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ జీవామతం, గణామతం, గ్రవామతాలను అంతర్ పంటలు వేసి మీ పొలాలను సురక్షితంగా కాపాడుకోవాలని తెలిపారు. గతంలో ప్రకృతి వ్యవసాయం చేయడానికి ఎరువులు, ఆవుపేడ వాడే వారని ఆ దిశగా ప్రస్తుతం ప్రతి ఒక్క రైతు పంట సాగు విధానాన్ని మార్చుకోవాలన్నారు. ఎంపీడీవో డేవిడ్ ప్రభాకర్ మాట్లాడుతూ మీ ప్రాంతాల్లో వేస్తున్న పంటలను ఈకేవైసీ చేయించుకుంటే రాయితీలు ప్రతి ఒక్కరికి అందుతాయని తెలిపారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ పల్నాడు, గుంటూరు జిల్లాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లా డుతూ రైతులు, కౌలురైతులు వ్యవసాయ కూలీలు ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్గానిక్ పంటలు వేయటానికి ముందుగా 30 రకాల విత్తనాలు భూమిలో వేసి, భూమిని దున్నటం వలన మంచి పోషకాలు అందు తాయనీ, ఫలితంగా ఆశించిన మేర పంట దిగుబడులు వస్తాయని తెలిపారు. భూసార పరీక్షలు చేయించుకుని, భూసారాన్ని బట్టి పంటల మార్పిడి విధానాన్ని అలవాటు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ చంటి వరప్రసాద్ మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యంగా, ఆనందంగా, ఆహ్లాదకరంగా ఉండే పంటలు సాగు చేయాలని మన జీవితాలు బాగుంటాయని ఆ దిశగా మీరు నత్రజని, భాస్వరం ,పొటాషియం జింకు, సల్ఫేట్ లాంటి వాడకుండా సహజ సిద్ధమైన ఎరువులు వాడి మీ పొలాల గట్లపై కంది, బెండ, బంతినారు వేసి మీ పంటలకు పురుగు ఆశించకుండా చూసుకోవాలని అన్నారు. రైతులు, కౌలురైతులు, వ్యవసాయకూలీలు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ ఫిర్యాదులు పరిశీలన

ప్రజాశక్తి - చేబ్రోలు

ఎస్‌సి కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్ శనివారం మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కలెక్టర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నోడల్ అధికారులను నియమించినట్లు ఆయన తెలిపారు. అక్టోబర్ 1 నుంచి బాధ్యతలను స్వీకరించారనీ, విధుల్లో భాగంగా ఈరోజు పొన్నూరు నియోజకవర్గ నోడల్ అధికారిగా చేబ్రోలు తహశీల్దార్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ ఫిర్యాదులను పరిశీలించినట్లు తెలిపారు. పరిశీలన అనంతరం మండలానికి సంబంధించిన నివేదికను కలెక్టరుకు అందజేస్తామన్నారు. కాగా మండలంలో ఈనెల1 నుండి ఇప్పటి వరకు 4 ఫిర్యాదులు వచ్చాయనీ, నాల్గింటిని పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు కె శ్రీనివాస్‌శర్మ, డిప్యూటీ తహశీల్దారు బి.శ్రీనివాసరావు ఆర్ఐ పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఈడీ శ్రీనివాస్

అన్నదానానికి గట్టుపల్లి వితరణ

ప్రజాశక్తి - చేబ్రోలు

చేబ్రోలు గ్రామంలో శనివారం అయ్యప్ప సద్ది కార్యక్రమాన్ని తన సొంత ఖర్చులతో నిర్వహిస్తున్న స్థిరాస్తి వ్యాపారస్తులు, వింధ్యశ్రీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ గట్టుపల్లి సుబ్రహ్మణ్యంకు స్థానికులు అభినందనలు తెలిపారు. దానగుణంతో ముందు వరుసలో ఉండే సుబ్రహ్మణ్యం ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది అయ్యప్ప భక్తుల అన్నదాన సేవా కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. నిరంతరాయంగా 41 రోజులపాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఈ ఏడాది చేబ్రోలు గ్రామంతో పాటు చుట్టుప్రక్కల మాలధారణ చేసే దాదాపు 500పైన దీక్ష భూనిన భక్తులందరికీ సద్ది సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్నదాన కార్యక్రమం సద్ది చేయటం జరుగుతుందని సుబ్రమణ్యం తెలిపారు.



అయ్యప్ప సద్ది కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు



శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పట్టణంలోని 5, 6, 8, 10వ వార్డులలో రూ.57.20 లక్షల అంచనాతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడి బోయిన రాధిక శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ వార్డుల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. పట్టణ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు. మునిసిపల్ కమిషనర్ జె.రామఅప్పల నాయుడు, మున్సిపల్ ఇంజనీర్ ఇంజనీర్ శ్రీకాంత్, డిఇఇ శ్రీనివాసులు, ఎఇ సునీల్ కుమార్, కౌన్సిలర్ కొర్రపాటి లక్ష్మి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న కృష్ణారావు, తదితరులు

పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి దేవస్థానం సెంటర్లో కాపు రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తాటి కృష్ణారావు నాయుడు తన కుమారుడు తాటి శివ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం యాత్రికులకు, పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా ఏపీఎస్పీ రిటైర్డ్ అధికారులు హాజరయ్యారు. వారు మాట్లాడారు. కృష్ణారావునాయుడు ప్రతి ఏడాది తన కుమారుని పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమం, అనాథ శరణాలయాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఈ ఏడాది దేవస్థానం సెంటర్లో పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఉద్యోగులు గుడిపాటి చిన్న తిరుపతి నాయుడు, ఎస్.శివ శంకరరెడ్డి, వీకే గోవర్ధనరావు, పీ.పావనరావు, ఏ భాస్కరరెడ్డి, సీహెచ్ చిన్న వెంకటేశ్వర్లు, యు పెద్దిరాజు, కె.నాంచారయ్య, పగడాల శ్రీను, వై గోవిందయ్య పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న వాలంటీర్లు

క్రీడా బృందానికి స్వాగతం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సర్దార్ ఏ 150 సందర్భంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'యూనిటీ మార్చ్ - జల సంగమ్ నుండి జన సంగమ్ వరకు' కార్యక్రమంలో భాగంగా ఢిల్లీ నుండి విజయవాడకు చేరుకున్న బృందానికి నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ జాతీయ సేవా పథకం వాలంటీర్లు పున్నమి ఘాట్ వద్ద జాతీయ పతాకాలతో స్వాగతం పలికారు. కార్యక్రమానికి రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి ప్రొఫెసర్ మద్దినేని సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై వాలంటీర్ల ఉత్సాహం, సేవాస్ఫూర్తి, క్రమశిక్షణను ప్రశంసించారు. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రేఖానరేష్‌బాబు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ బి.అలేఖ్య సమర్థంగా సమన్వయం చేశారు. స్టూడెంట్ కోఆర్డినేటర్లు పి.నివేదిత స్ఫూర్తి, ఎం.రవి, కె. హర్షవర్ధన్, చిరంజీవి కార్తికేయ శ్రీరామ్, షేక్ అస్మా, అక్కసాత్విక విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రేవ్. సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ బి. పాముల రెడ్డి, వాలంటీర్ల సేవా కార్యక్రమాన్ని అభినందించారు.



గెలుపొందిన విద్యార్థులు

బాస్కెల్ బాల్ పోటీల్లో ఏసిఎంఇ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఇంటర్‌స్కూల్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఏసిఎంఇ స్కూల్ రెండవ స్థానంలో నిలిచిందని స్కూల్ డైరెక్టర్ సౌగంద్‌కృష్ణ, ప్రిన్సిపాల్ దీప్తి నందమూరి తెలిపారు. శనివారం వారు. విద్యార్థులు చదువుతోపాటు, క్రీడలకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. క్రీడలు మానసిక, శారీక అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.



ఉద్యోగాలు పొదిన విద్యార్థినీ విద్యార్థులు

హిందూ ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఫార్మా.డి చదివిన విద్యార్థులు హైదరాబాద్‌లోని ప్రముఖ హాస్పిటల్స్, ఔషధ పరిశోధనా సంస్థలలో ఉపాధి పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలియచేశారు. ఆర్.శ్రీనివాసరావు, షేక్ ఆసిఫ్ హైదరాబాద్‌లోని ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీలో, అలాగే కే.లక్ష్మి శసాంక ప్రముఖ వాక్సిన్ తయారీ సంస్థ భారత్ బయోటెక్‌లో, కే.దేవిత్రినాథ్ జేనోమిక్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌లో, ఎ.దివ్య కమలవాసిని ఇఎస్‌ఐ హాస్పిటల్‌లో క్లినికల్ రీసెర్చ్ అసోసియేట్స్‌గా ఉపాధి పొందినట్లు తెలియచేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, హెచ్‌ఓడి. డాక్టర్ ఎన్.హేమకుమారి అభినందనలు తెలిపారు.

121. విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ నాగోతు ప్రకాష్, సబిత...

ఫుట్‌బాల్ పోటీలకు ఇంటర్‌నేషన్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడుజిల్లా



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్లు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మధర్ థెరిస్సా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగోతు ప్రకాష్ తెలిపారు. డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ ఈ నెల 24న మండలం లోని కోటప్పకొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన ఎంపికలలో అండర్-14 విభాగంలో రామ్ సాయి రెడ్డి, హేమంత్, నౌషద్, అఖిలాష్, మను సిద్దార్థ, వర్ధన్, వరుణ్ అండర్-17 విభాగంలో రాఘవరెడ్డి, అఖిలేష్, అక్బర్ అలీ, మంజునాథ్ లు ఎంపికయ్యారన్నారు. కేసానుపల్లిలో ఏర్పాటు చేసిన అభినందన సభలో డైరెక్టర్ నాగోతు సబిత మాట్లాడుతూ తమ స్కూల్ లో విద్యార్థులకు విద్యతో పాటు ఆట పాటలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తా చాటి పల్నాడు జిల్లాకు పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు. ప్రిన్సిపాల్ రేఖా పులేకర్, డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ ఎన్.సురేష్ కుమార్, కోచ్ జె.శివ శంకర్ విద్యార్థులను అభినందించారు.

కళ్లంలో క్వాంటం కంప్యూటర్ కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి- గుంటూరు



మాట్లాడుతున్న ఉమా మహేశ్వరరెడ్డి

ప్రపంచీకరణ నేపథ్యంలో నూతన సాంకేతిక విద్యకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు విస్తఅతంగా ఉన్నాయని కళ్ళం హరినాద్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజి చైర్మన్ కళ్ళం మోహన్ రెడ్డి అన్నారు.దాసరి పాలెంలోని కళ్లం ఇంజినీరింగ్ కాలేజిలో 'ది క్వాంటం క్యాంబిల్' పేరుతో క్వాంటం కంప్యూటర్ కోర్సు నూతన తరగతులు ఘనంగా ప్రారంభించారు.ముఖ్య అతిథిగా పాల్గన్న చైర్మన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా తమ ఇంజినీరింగ్ కళాశాలలోనే క్వాంటం కంప్యూటింగ్ తరగతులు ప్రారంభించినట్లు చెప్పారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా పరిశోధన, నూతన ఆవిష్కరణల వైపు దఅష్టి సారించాలన్నారు. కళాశాల డాక్టర్ మొవ్వ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ జడ్సన్, అధ్యాపకులు డాక్టర్ నాగార్జున, చుక్క శ్యాంసన్, కె.నాగేశ్వరరావు, డాక్టర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వివాదంలో మునిసిపల్ ఆస్తులు

వీక్షణం

గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన పలు ఆస్తులు వివాదంలో చిక్కుకుంటున్నాయి. ప్రధానంగా రూ.100 కోట్లకు పైబడిన స్థలాలు, కట్టడాలు ప్రజలకు ఉపయోగించే విధంగా రూపు దిద్దేందుకు నగర పాలక సంస్థ పిపిపి వైపు అడుగులు వేస్తోంది. ఈ ఆస్తులను ఉపయోగించుకుని లబ్ధిపొందేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడంతో మీరే దోషి అంటే మీరే దోషి అని టిడిపి, వైసిపి నేతలు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ విషయంలో రెండు పార్టీలదీ ఒక్కటే వైఖరి. ప్రైవేటు సంస్థలకు అప్పగించడం ద్వారా ఆర్థికంగా లబ్ధిపొందడానికి ప్రయత్నిస్తున్నారు. పిపిపి విధానంలో ఇరు పార్టీలదీ ఒక్కటే వైఖరి అయినా నిర్వహణలో మాత్రం తేడాలు ఉంటున్నాయి. అంతిమంగా పేదలకు మేలు చేసే విషయంలో మాత్రం రెండు పార్టీలు భిన్నధృవాలుగా నిలుస్తున్నాయి. తాజాగా గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో 1999లో చేపట్టిన నార్ల తాతారావు ఆడిటోరియం దాదాపు 25 ఏళ్లుగా అసంపూర్తిగా ఉంది. ఈ ఆడిటోరియం పూర్తి చేసి ప్రజలకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని పలు మార్లు మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో కోరారు. కార్పొరేషన్ నిధులతో ఆడిటోరియం పూర్తి చేసి పేద మధ్య తరగతి ప్రజలకు శుభ కార్యాలు, కళా సాంస్కృతిక కార్యక్రమాలు, సభలు, సమావేశాలు నిర్వహణకు తక్కువ ఖర్చుతో వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని లక్ష్మణరావు ప్రతి సమావేశంలో ప్రస్తావించే వారు. వైసిపి ప్రభుత్వ హయంలో దాదాపు నాలుగేళ్లలో ఈ అంశాన్ని అప్పటి కౌన్సిల్ పక్కన పెట్టింది. గత ఏడాది మేనెలలో మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర బాధ్యతలు స్వీకరించిన తరవాత ఈ అంశంపై కదలిక వచ్చింది. నార్ల తాతారావు ఆడిటోరియంను పిపిపి విధానంలో అభివృద్ధి చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీనిపై వైసిపి అభ్యంతరం వ్యక్తం చేసింది. పేదలకు ఉపయోగపడలాంటే నగరపాలక సంస్థ నిర్మాణం చేపట్టాలని సూచించింది. రూ.100 కోట్ల ఆస్తిని ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం సరికాదని ఆ పార్టీ వాదిస్తోంది. ఇప్పటికిప్పుడు ఈ ఆడిటోరియం నిర్మాణం పూర్తి చేయాలంటే రూ.6 కోట్లు అవసరం అవుతాయని అంత నిధులు తమ వద్ద లేవని అందువల్ల పిపిపి విధానం ద్వారా నిర్మాణం చేపట్టి నిర్వహణ మొత్తాన్ని అన్నమయ్య సేవా సమితికి అప్పగిస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రకటించారు. ఆడిటోరియం నిర్మాణం వల్ల వచ్చే ఆదాయంలో 60 శాతం కార్పొరేషన్‌కు 40 శాతం సేవా సమితికి తీసుకునేలా ప్రతిపాదన చేశారు. అయితే ఆడిటోరియంలో ప్రజల నుంచి వసూలు చేసే రుసుముతో పాటు ఇతర వ్యాపారాలు చేసుకునేందుకు సమితికి అవకాశం ఉంటుంది. ఈ వ్యాపారం ద్వారా ప్రజల నుంచి లక్షలు దండుకునే అవకాశం ఉంది. వైసిపి హయంలో రాష్ట్రంలోని పలు తిరుమల తిరుపతి దేవస్థానానంకు చెందిన కల్యాణ మండపాలను నిర్వహణ నిమిత్తం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు గరిష్టంగా లీజు పరిమితి విధించారు. గుంటూరు మార్కెట్ సెంటర్‌లో ఉన్న టిడిపి కల్యాణ మండపం లో 12 గంటలకు కేవలం రూ.15 వేలు అద్దె వసూలు చేస్తున్నారు. కరెంటు ఛార్జీలు, ఇతర ఖర్చులు అదనంగా తీసుకుంటున్నారు. అయితే ఈ అద్దెతోనే నిర్వహకులు సరిపెట్టుకోవడం లేదు. శుభ కార్యాక్రమాలకు అవసరమయ్యే లైటింగ్, డెకరేషన్, క్యాటరింగ్, ఇతర అవసరాలకు కూడా ఈ కాంట్రాక్టర్లే ఎక్కువగా నిర్వహిస్తున్నారు. ఇందుకు రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. అద్దె తక్కువగా ఉన్నా ఇతర నిర్వహణ ఖర్చులు భారీగా వసూలు చేయడం ద్వారా విలువ ఆధారిత వ్యాపారాలు బాగా చేస్తున్నారు. దీంతో అద్దె తక్కువగా ఉన్నా వీటి ద్వారా అధిక ఆదాయం రాబట్టుకుంటున్నారు. అయితే నార్ల ఆడిటోరియంలో కూడా అద్దె ఎంత వసూలు చేయాలన్న అంశంపై స్పష్టత లేదు. అన్నమయ్య సేవా సమితికి 33 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడం కూడా వివాదస్పదంగా మారింది. ఒక్కో సంస్థకు మూడు దశాబ్దాల తరబడి నిర్వహణ పేరుతో వసూళ్లకు ప్రభుత్వమే అవకాశం కల్పిస్తోంది. ఈనేపథ్యంలో నగరపాలక సంస్థ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి అన్నమయ్య సేవా సమితికి ఆడిటోరియం నిర్వహణకు అవకాశం కల్పిస్తూ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతూ తీర్మానం చేశారు. దీనిపై తాము న్యాయపోరాటం చేస్తామని వైసిపి ప్రకటించింది. అయితే వైసిపి హయంలో పిపిపి పద్ధతిలో పిపికే నాయుడు కూరగాయల మార్కెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేయలేదా అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రశ్నించారు. నార్ల ఆడిటోరియం కన్నా నాలుగు రెట్లు ఎక్కువ విలువ కలిగిన ఆస్తిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు అప్పట్లో వైసిపి ప్రయత్నించలేదా అని ఆమె ప్రశ్నించారు. అయితే నగరపాలక సంస్థ రూ.6 కోట్లు వెచ్చించి ఆడిటోరియం నిర్మిస్తే వివాదం లేకుండా పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. అలాగే గుంటూరులోని మానస సరోవరం, పలు ఖాళీ స్థలాల్లో నిర్మాణాలకు కూడా పిపిపి విధానంలోనే ఆస్తుల అప్పగింతకు అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేయడం విమర్శలకు దారితీస్తోంది.

- ఎ.వి.డి.శర్మ

మెడికల్ కళాశాలలపై ప్రభుత్వ తీరు సరికాదు

ప్రభుత్వ మెడికల్ కాలేజిల పరిరక్షణ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు



జెవివి బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వం వద్ద తగిన నిధులు లేకపోవడం వలన మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో నిర్మించాలని యోచిస్తున్నామని, తద్వారా మెడికల్ సీట్లు పెరుగుతాయని రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని ప్రభుత్వ మెడికల్ కాలేజిల పరిరక్షణ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక రామన్నపేటలోని జనచైతన్యదిక హాల్లో శనివారం విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆలిండియా కోటాలో కేటాయించాల్సిన 15 శాతం సీట్లలో 7.5 శాతం యాజమాన్య కోటాకు కేటాయించి వాళ్లకు మేలు చేయాలని చూస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన 5 వైద్య కళాశాలలకు ఇటీవల నేషనల్ మెడికల్ కౌన్సిల్ కేటాయించిన 60 పీజీ సీట్లను పూర్తిగా కన్వీనర్ కోటా విధానంలోనే భర్తీ చేయాలని కోరారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానం మేరకు గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన జీవో నెంబర్ 107,108 లను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ కోకన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 100మంది మేధావులతో ముఖ్యమంత్రికి బహిరంగ లేఖను రూపొందిస్తున్నామని, త్వరలో రాష్ట్ర గవర్నర్‌ని కలుస్తామన్నారు.కమిటీ కో కన్వీనర్ వి.వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి సూచన మేరకు పీపీపీ విధానంలోగల లోపాలను గుర్తించేందుకు, వైద్య ఆరోగ్య రంగంలో 26 ఏళ్ల విశిష్ట సేవలు అందించిన విశ్రాంత ఐఏఎస్ అధికారిణి కె.సుజాత, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె. శ్రీనాథ్‌రెడ్డి పేర్లను పరిశీలించాలని కోరారు. ఈ సందర్భంగా వైద్య కాలేజిల ప్రైవేటీకరణపై జన విజ్ఞాన వేదిక రూపొందించిన బుక్‌లెట్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. సమావేశంలో కొరివి వినయ్‌కుమార్, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి, జెవివి జిల్లా కార్యదర్శి టి.జాన్ బాబు, కోశాధికారి జి.వెంకట్రావు, లంబాడి హక్కుల పోరాట సమితి నేత డి.చంద్రా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ వ్యాలిడేషన్ చట్టం రద్దు చేయాలి

ప్రజాశక్తి - గుంటూరు



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రాఘవేంద్రన్ కోరారు. ఆలిండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఐదవ త్రైవార్షిక వార్షిక సమావేశాలు బ్రాడీపేట లోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రారంభం అయ్యాయి. తొలుత యూనియన్ పతాకాన్ని రాఘవేంద్రన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రన్ మాట్లాడుతూ పెన్షనర్లను రిటైర్మెంట్ తేదీ ప్రాతిపదికన విడదీసి, వారికి వేతన సంఘాల లబ్దిని నిరాకరించడానికి ఉద్దేశించిన పెన్షన్ వాలిడేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం దురుద్దేశం పూర్వకంగా ఈఏడాది ఫిబ్రవరిలో ఫైనాన్స్ బిల్లులో ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించామన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, ఆలిండియా పోస్టు ఎంప్లాయిస్ పోస్టాఫీసు, ఎంటిఎస్ ఉపాధ్యక్షులు సిహెచ్. విద్యాసాగర్, ఎఐపిఆర్ పిఎ ఆలిండియా నాయకులు దేవనాద్ పలు వురులు నాయకులు ప్రసంగించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ శాఖ నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కమిటీకి అధ్యక్షులుగా నిమ్మగడ్డ నాగేశ్వరరావు, సెక్రెటరీగా కె.సుభాస్ చంద్రబోస్, ట్రెజరర్‌గా ఇ.భానుబాబు, మరో 14 మందతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నేడు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

ప్రజాశక్తి - గుంటూరు



కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ - గుంటూరు, ది రాజోలు తాలూకా తెలగ ఉద్యోగుల సంక్షేమ సంఘం - రాజోలు సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 280 మంది పేద విద్యార్థులకు నేడు రూ.11.45 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్‌చంద్ర తెలిపారు. ఇందులో రూ.5.35 లక్షలు తులసి సీడ్స్ వారు కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ ద్వారా పేద విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు ఈ కార్యక్రమం శివకోడులోని మంగెన గంగయ్య తెలగ కళ్యాణ మండపంలో నిర్వహించటం జరుగుతుందని, తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరయ్యి ఉపకార వేతనాలు అందచేస్తారని యోగీష్‌చంద్ర తెలిపారు.